Follow: @ANNTELUGU

30-11-2024

ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 315 పేజీలు-09 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/9316 WWW.EPAPER.MAHAADAILY.COM



## తెలంగాణవ్యాప్తంగా..
# దీక్షా దివస్

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. కరీంనగర్ జిల్లా అలుగునూరు చౌరస్తాలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిద్ధిపేటలో మాజీ మంత్రి హరీష్‌రావు, ఆదిలాబాద్ జిల్లాలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే అనిల్ యాదవ్, వరంగల్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో మెదక్‌లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో, జనగామ జిల్లాలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహించారు. తెలంగాణ భవన్ లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు.

- హైదరాబాద్, మహా

కొత్త కళ

## అవును.. నా పెళ్లి

- కీర్తి సురేష్ కన్ఫామ్
- డిసెంబర్‌లో గోవా వేదికగా వివాహం



08

స్నేహమిలా

## ట్రంప్ సేఫ్‌గా లేరు

- రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆందోళన
- కజకస్తాన్ సదస్సులో వ్యాఖ్యలు



07

నిను వదల

## జగన్‌కు ఆస్కార్ ఇవ్వాలి

- అబద్ధాలు అందంగా అల్లినందుకు సన్మానించాలి
- అదానీ అంశంపై షర్మిల వ్యాఖ్యలు



02



సమంత తండ్రి

## జోసెఫ్ ప్రభు కన్నుమూత

*సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన సామ్*

**మహా:** ప్రముఖ సినిమా హీరోయిన్ సమంత ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. ఆమె తండ్రి జోసెఫ్ ప్రభు కన్నుమూశారు. ఈ విషయాన్ని సమంతనే తెలియజేశారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. "మనం మళ్లీ కలిసే వరకు నాన్న" అంటూ హార్ట్ బ్రేకింగ్ ఎమోజీని జత చేస్తూ ఆ పోస్ట్ పెట్టారు. జోసెఫ్ ప్రభు మృతికి అనారోగ్య సమస్యలే కారణమని తెలుస్తోంది. సమంత తండ్రి చనిపోయారన్న విషయం తెలిసి పలువురు ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలుపుతున్నారు. జోసెఫ్ ప్రభు నీనెట్ ప్రభు దంపతులకు జన్మించిన సమంత.. తన జీవితంలో ఆమె తండ్రి జోసెఫ్ ప్రభు ముఖ్యపాత్ర పోషించారని గతంలో చాలాసార్లు సామ్ చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. సినిమాలతో బిజీబిజీగా ఉన్నా కూడా తన తల్లిదండ్రులను కలిసేందుకు సామ్ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండేవారు.

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 78,110 |
| 22 క్యారెట్ | 71,600 |
| సిల్వర్ (కేజీ) | 91,500 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | 79,802.79 |
| నిఫ్టీ | 24,131.10 |

### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

### ఈరోజు గుడ్డు ధరలు

ఎన్ఈసీసీ గుడ్డు ధర


| 1 పీస్ | ట్రే |
|---|---|
| 5.95 | 178.5 |

హోల్ సేల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 5.95 | 178.5 |

రిటైల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 6.43 | 192.78 |



# పవనే వెపన్

**జాతీయ రాజకీయాల్లోకి రమ్మంటున్న బీజేపీ కేంద్ర నాయకత్వం**

## పవన్ ముందు కీలక ప్రతిపాదన.. కేంద్రమంత్రిగా పవన్.. పిఠాపురం ఎమ్మెల్యేగా నాగబాబు?

నాలుగు రోజుల పవన్ ఢిల్లీ టూర్ వెనుక అంతర్గత ఎజెండా

వచ్చే ఏడాది ఢిల్లీ, బిహార్ తర్వాత ఏడాది తమిళనాడు, బెంగాల్, కేరళ ఎన్నికలు

పవన్ నేషనల్ పాలిటిక్స్ కు బాగా సూటవుతాడంటున్న బీజేపీ హైకమాండ్

ఏపీ, మహారాష్ట్ర ఎన్నికల్లో పవన్ సామర్థ్యాన్ని గుర్తించిన కేంద్రం

సనాతన స్లొగన్‌తో ఆర్ఎస్ఎస్ ఫిదా.. తెలుగు రాష్ట్రాల్లో.. తిరుగులేని పవనాలు

**అమిత్ షా ఓపెన్ ఆఫర్.. మోడీ లవ్**

**పవన్ దేశరాజకీయాల్లో కాషాయ తురుపుముక్క**

కంది.రామచంద్రారెడ్డి:

జనసేనాని పవన్ కల్యాణ్ ఎపి రాజకీయాల్లో కింగ్ మేకర్ కాగా, భారతీయ జనతాపార్టీ ఆయనను మరో కోణంలో చూస్తోంది. పవన్ ఒక్క ఆంధ్రాకు, తెలుగురాష్ట్రాలకు కాదు భారతదేశ రాజకీయాల్లోనే ఒక సమ్మోహనశక్తిగా, సనాతన ధర్మ పరిరక్షణ సారధిగా, కాషాయ తురుపుముక్కగా చూస్తోంది. అందుకే ఎపికి డిప్యూటీసీఎంగా ఉన్నా.. కేంద్ర రాజకీయాల్లోకి రా..రమ్మంటోంది. ఎపిలోనూ, మహారాష్ట్రలోనూ పవన్ పద్ధతిగా పనిచేసి ప్రత్యర్థులను కొట్టిన తీరు బిజెపి పెద్దలను ఆశ్చర్యపరిచింది. అందుకే మీరు ఎపికి పరిమితం కావొద్దు. నేషనల్ పాలిటిక్స్ లోకి రమ్మని ఆహ్వానిస్తోంది. పవన్ తోడుంటే.. దేశవ్యాప్తంగా ప్రచారంలో గానీ, అనుకున్న అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో గానీ తిరుగుండదని బిజెపి అగ్ర నాయకత్వం భావిస్తోంది. తాజాగా నాలుగురోజుల పాటు ఢిల్లీలో ఉండడం వెనుక పవన్ వ్యూహం కంటే బిజెపి అగ్రనాయకత్వ వ్యూహమే ప్రధానంగా కనిపిస్తోంది. ప్రస్తుతం నోటిఫికేషన్ విడుదలైన రాజ్యసభ స్థానాల్లో ఒక దానికి నాగబాబును ఎంపిక చేయాలని జనసేన అధినేత పవన్ భావించగా, బిజెపి కేంద్ర నాయకత్వం మాత్రం పవన్ మీరు కేంద్రంలోకి రావొచ్చు కదా.. అంటూ ఆహ్వానించింది. అదే ఫలిస్తే.. పవన్ కేంద్రమంత్రిగా, నాగబాబు పిఠాపురం ఎమ్మెల్యేగా మారిన ఆశ్చర్యంలేదని ఢిల్లీవర్గాలు అంటున్నాయి.

మిగతా 2లో


**లగచర్ల ఫార్మా రద్దు**

## భూసేకరణ నోటిఫికేషన్
# ఉపసంహరణ

*జనం మాటే.. రేవంత్ బాట*

నిన్న దిలావర్ పూర్.. నేడు లగచర్ల

ఫార్మాస్థానంలో కాలుష్యరహిత పరిశ్రమలు



**హైదరాబాద్, మహా:** ప్రజల అభిప్రాయాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిగణనలోకి తీసుకుంటున్నారు. జనం మాటే.. తన బాట అని స్పష్టం చేస్తున్నారు. ప్రజల కోసం తగ్గేందుకైనా రెడీ అంటున్నారు. లగచర్ల రైతుల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

మిగతా 2లో

**కేటీఆర్ నువ్వు జైలుకే**

## తొందరెందుకు వెయిట్ అండ్ సీ

**ఇక్కడ సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని మరిచిపోకు**

**.. మంత్రి సురేఖ సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్, మహా:** కేటీఆర్ మాట్లాడితే జైలుకు పోతా అంటున్నావు.. తప్పు చేసిన వారు తప్పక జైలుకు పోవాల్సిందే.. మీ పాలనలో అంతా నాశనమేనంటూ తెలంగాణ మంత్రి కొండా సురేఖ సీరియస్ కామెంట్స్ చేశారు. హైదరాబాద్ లోని తన ఛాంబర్ లో శుక్రవారం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ..

మిగతా 2లో

### కేసీఆర్ అంటే పేరు కాదు..
# తెలంగాణ పోరు

**ఉద్యమంలో కరీంనగర్ ప్రజల పాత్ర కీలకం**

**టీఆర్ఎస్‌కు జన్మనిచ్చిన గడ్డ కరీంనగర్.. దీక్షా దివస్‌లో కేటీఆర్**



**హైదరాబాద్, మహా:** కేసీఆర్ అంటే పేరు కాదని.. కేసీఆర్ అంటే తెలంగాణ పోరు అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. పదవి త్యాగంతో ఉద్యమాన్ని ప్రారంభించి, తన ప్రాణాన్ని సైతం పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించిన నేత అని ఆయన స్పష్టం చేశారు. దీక్షా దివస్ లో భాగంగా కరీంనగర్ అల్గునూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పార్టీకి జన్మనిచ్చిన పురిటి గడ్డ కరీంనగర్ అంటూ ఆయన పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో కరీంనగర్ లో నిర్వహించిన సింహ గర్జన ద్వారానే కేసీఆర్ దేశానికి పరిచయమయ్యారని కేటీఆర్ గుర్తుచేశారు. ఆనాడు జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కేసీఆర్ కు కరీంనగర్ ప్రజలు 2 లక్షల మెజారిటీ ఇచ్చి తెలంగాణ వాదాన్ని బలంగా ఢిల్లీ వరకు చేరేలా చేశారన్నారు. ఇలా ఒక్కటి కాదు రెండు కాదు.. ఎన్నో సందర్భాలు ఉన్నాయని అన్నారు. తెలంగాణ సాధనలో కరీంనగర్ గడ్డ ప్రజలది కీలక పాత్ర అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టి నేటికి 15 ఏళ్లు అవుతుందని గుర్తుచేశారు.

## పెద్దపులి పంజా

- కాగజ్ నగర్ మండలంలో విషాదం.. వివాహిత మృతి
- భయాందోళనలతో అటవీ కార్యాలయం ముట్టడించిన ప్రజలు
- మహిళ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం

వివరాలు 2లో



## అల్లు అర్జున్‌ను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

సంబరపడుతున్న పుష్ప ఫ్యాన్స్

02

## కొందరు దొంగలు పార్టీలోకి వచ్చారు

**పందికొక్కుల్లా తిని మళ్లీ పోయారు**

ఇకపై అలాంటివారికి చోటుండదు

సిద్దిపేటలో భగ్గుమన్న మాజీమంత్రి హరీష్ రావు

**సిద్ధిపేట, మహా:** కొందరు దొంగలు పార్టీలోకి వచ్చారని.. పందికొక్కుల్లగా తిని మళ్లీ వెళ్లిపోయారని మాజీమంత్రి హరీష్ రావు మండిపడ్డారు. దీక్షా దివస్ సందర్భంగా సిద్దిపేట పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి, రంగాధంపల్లి అమర వీరుల స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణను కాపాడాలని ఆరోజు కొన్ని నిర్ణయాలు తీసుకున్నారని.. ఇకపై అలాంటి వారికి పార్టీలో చోటు ఉండదని స్పష్టం చేశారు. గడ్డి పోచల్లాగా పదవులను తెలంగాణ కోసం త్యాగం చేశామన్నారు.

మిగతా 2లో



# పవనే వెపన్

(మొదటిపేజీ తరువాయి)


డిప్యూటీ సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత నాలుగు రోజుల పాటు ఢిల్లీలో పవన్ కల్యాణ్ ఎప్పుడూ గడపలేదు. ఈ సారి మాత్రం..నాలుగు రోజుల పాటు డిల్లీలో ఉండి కేంద్ర మంత్రులతో పాటు ప్రధానితోనూ మాట్లాడారు. బీజేపీ పెద్దలతో నూ చర్చలు జరిపారు. ఎంపీలకు విందు ఇచ్చారు. జాతీయ మీడియాకూ ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఈ టూర్ వెనుక ఖచ్చితంగా ఏదో అంతర్గత ఎజెండా ఉందన్న అభిప్రాయం సహజంగానే రాజకీయవ ర్గాలకు వస్తుంది. ఎన్డీఏ కూటమి తరపున దక్షిణాది హిందూత్వ ఫేస్‌గా పవన్ కల్యాణ్‌ను ఫోకస్ చేయా లన్న ప్లాన్ లో బీజేపీ ఉందని ఈ దిశగా ఆయనను ఒప్పించేందుకు కసరత్తులు చేస్తోందని అంటున్నారు.

### హిందూత్వ నినాదంతో హాట్ టాపిక్

తిరుమలలో లడ్డూ కల్తీ వ్యవహారం తర్వాత పవన్ కల్యాణ్ అనూహ్యంగా సనాతన ధర్మ పరిరక్షణ బాట ఎంచుకున్నారు. వారాహి సనాతన ధర్మ పరిరక్షణ డిక్లరేషన్ ప్రకటించారు. ఉదయనిధి వ్యాఖ్యలను ఖండించి తమిళనాడులోనూ హైలెట్ అయ్యారు. మహారాష్ట్ర ప్రచారంలోనూ హిందూత్వ వాదాన్ని వినిపించారు. జాతీయ మీడియాలో పవన్ కల్యాణ్‌కు ఇప్పుడు ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. బీజేపీ లైన్‌లో గట్టిగా హిందూత్వ వాదం వినిపించే కూటమి పార్టీ నాయకుడిగా ఆయనకు వచ్చిన పేరు జాతీయ స్థాయిలో ఫోకస్ తెచ్చి పెట్టింది.

### మీ అవసరం ఉంది బాసూ..

పవన్ కల్యాణ్‌కు వచ్చిన ప్రత్యేకమైన ఇమేజ్ ఇప్పుడు బీజేపీకి. ఎన్డీఏ కూటమికి ఇతర రాష్ట్రాల్లో కూడా అవ సరమని భావిస్తున్నారు. ఆయనతో ఢిల్లీలో ప్రచారం చేయించుకుంటారని అంటున్నారు. ఇప్పుడు తమిళ నాడులో కూడా ఆయన హాట్ టాపిక్. అందుకే పవన్ కల్యాణ్ ఆరు నెలల్లో కేంద్రంలో భాగం అవుతారన్న ప్రచారం జరుగుతోంది. దీనిపై బీజేపీ పెద్దల ఆలో చనలు ఎలాఉన్నాయో.. పవన్ కల్యాణ్‌కు జాతీయ స్థాయిలో రాజకీయాలు చేయాలన్న ఆలోచన ఉందో లేదో మాత్రం స్పష్టత లేదు. కానీ వచ్చే కొన్ని రోజుల్లో కీలక పరిణామాలు చోటు చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. 2025లో ఢిల్లీ, బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇటీవల బిహార్ లో పుష్ప2 వేడుకకు లభించిన ఆదరణ చూశారు. ఇక పవన్ అడుగుపెడి తే.. అంతకు ఎన్నిరెట్లు ఉంటుందోనన్న చర్చ ఉంది. ఇక 2026లో తమిళనాడు లో పవన్ వెపన్ అత్యంత కీలకం. తెలుగురాష్ట్రాల హీరోలకు తమిళనాడులో ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఇక పవన్ కల్యాణ్ వేరే లెవెల్. 2026లో తమిళనాడుతో పాటు కేరళ, బెంగాల్ అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ లోగా పవన్ శక్తిని పెంచుకుంటూ వెళ్తే రాజకీయంగా బిజెపికి ప్రయోజనముంటుందని, జాతీయ స్థాయిలో పవన్ శక్తి రానున్న రోజుల్లో పార్టీకి రక్షణ కవచంలా ఉంటుందన్న అంచనాలు పార్టీ పెద్దల్లో ఉన్నట్లు తెలిసింది. అటు ఎపిలోనే కాదు.. ఇటు తెలంగాణలో నూ పవన్ హవాకు తిరుగులేదని, ఓవరాల్ గా బిజెపి అగ్రనాయకత్వం జాతీయస్థాయిలో పవన్ పార్టీకి, భా రతరాజకీయాలకు ఓ పవర్ లా వెలుగొందుతాడన్న అంచనాలు కూటమిలోని పెద్దలు వ్యక్తం చేస్తున్నారు. మరి మోడీ ప్లాన్ ఏంటి.. పవన్ ఆచ రణేంటి? అన్నది ముందు ముందు తెలుస్తుంది.



### కేంద్రమంత్రిగా చేయాలని మోడీ ప్లాన్

గతంలోనే అమిత్ షా ఎంపీగా పోటీ చేయమని సూచించారు నేను అసెంబ్లీకే పోటీ చేద్దామనుకుంటున్నా అని..జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రక్రియ నామినేషన్ల ప్రక్రియ వచ్చినప్పుడు మీడియాతో చెప్పారు. నిజానికి బీజేపీ పెద్దలు సూచించినది పవన్ కల్యాణ్‌ను కేంద్రంలోకి రమ్మనే. ఎంపీగా అయితే మరింత ఫోకస్ ఉంటుందని అనుకున్నారు. కానీ పవన్ కల్యాణ్ ముందు ఇంట గెలవాలనుకున్నారు. అందుకే ఎమ్మెల్యేగానే పోటీ చేశారు. అయితే ఇటీవలి కాలంలో ఆయనకు వస్తున్న జాతీయ స్థాయి ఫోకస్ కారణంగా.. ఇప్పుడు మరోసారి బీజేపీ నాయకత్వం ఆయనను జాతీయ రాజకీయల వైపు రావాలని ఒత్తిడి చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. మోడీకి పవన్ అంటే ప్రత్యేక అభిమానం. అందుకే పవన్ శక్తిని జాతీయ స్థాయిలో ప్రభంజనం చేయాలన్నది మోడీ వ్యూహంగా చెబుతున్నారు. బిజెపికి కూడా అన్ని రాష్ట్రాల్లో దీని వల్ల ఉపయోగముంటుందని భావిస్తున్నారు.

# కొందరు దొంగలు పార్టీలోకి వచ్చారు

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్, టీడీపీలు తెలంగాణకు అనుకూలమని తీర్మానాలు చేసి, అవసరాలు తీరాక మాట మార్చారని దుయ్యబట్టారు. బీజేపీ ఒక ఓటు రెండు రాష్ట్రాలు అని చెప్పి మాట తప్పిందన్నారు. ఉద్యోగ గర్జన సన్నాహక సమావేశంలో ఆమరణ నిరాహార దీక్షకు కేసీఆర్ సంకల్పం తీసుకున్నారని.. కరీంనగర్ నుంచి దీక్ష కోసం కేసీఆర్ వస్తుంటే ఆయన్ను అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించారన్నారు. కేసీఆర్‌కు మద్దతుగా సిద్దిపేటలో దీక్ష శిబిరంలో దీక్ష చేస్తున్న తమపై గొర్రెల మందపై తోడేళ్ళు పడ్డట్టు పోలీసులు అరెస్టులు చేశారని మండిపడ్డారు. ఈ ప్రజావ్యతిరేక సర్కారును గద్దె దించేవరకు రైతుల పక్షాన, యువకుల పక్షాన, బాధితుల పక్షాన పోరాటానికి సంకల్పం తీసుకుందాం'' అంటూ హరీష్ రావు పిలుపునిచ్చారు.



# కేసీఆర్ దీక్ష ఫేక్.. విచారణ జరపాలి

### మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ రావు డిమాండ్

**న్యూఢిల్లీ, నవంబర్ 29:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం నాటి తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేసీఆర్ చేపట్టిన దీక్ష ఫేక్ అని మాజీ ఎమ్మెల్యే గోనే ప్రకాష్ రావు శుక్రవారం ఢిల్లీలో విమర్శించారు. కేసీఆర్ చేసిన దొంగ దీక్ష దివాస్‌పై కమిటి వేసి విచారణ జరపాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ దీక్ష చేసిన సమయంలో కేసీఆర్ జ్యూస్‌లు, మెడిసన్ తీసుకున్నారని ఆయన వివరించారు.

# జగన్‌కు ఆస్కార్ ఇవ్వాలి

### అదానీ అంశంపై షర్మిల ఆగ్రహం

**మహా:** మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మరోసారి ఫైర య్యారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. అదానీతో జగన్ ఒప్పందం ఏపీలోనే కాదు.. అంతర్జాతీయంగానూ చరిత్రే అంటూ ఆమె ఎద్దేవా చేశారు. 'ఎవరూ కొనని విద్యుత్ ను బంపర్ ఆఫర్ గా ప్రకటించడం, గంటల్లోనే కేబినెట్ భేటీ పెట్టి, ఒప్పందాలకు ప్రజాభిప్రాయం లేకుండా ఆమోదం తెలపడమంటే ఓ చరిత్రే. రూ. 1,750 కోట్లను ముఖ్యమంత్రికి ముడుపులుగా ఇవ్వడమంటే అది చరిత్రే కదా' అంటూ షర్మిల వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మొత్తం ఈ ఎపిసోడ్ లో అబద్ధాలను అందంగా అల్లినందుకుగానూ జగన్ మోహన్ రెడ్డికి ఆస్కార్ ఇవ్వాలంటూ ఆమె ఎద్దేవా చేస్తూ డిమాండ్ చేశారు.



అయితే, సన్మానాలు కోరుకునేముందు జగన్ పలు ప్రశ్నలకు సమాధానాలివ్వాల్సి ఉంటుందన్నారు. యూనిట్ విద్యుత్ కు అధిక ధర చెల్లించి కొన్నందుకు జగన్ ను సన్మానించాలా? అని ఆమె ప్రశ్నించారు.

# భూసేకరణ నోటిఫికేషన్ ఉపసంహరణ

(మొదటిపేజీ తరువాయి)

వికారాబాద్ జిల్లాలో కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని లగచర్ల, హకీంపేట, పోలేపల్లిలో ఫార్మా విలేజీల ఏర్పాటు ప్రతిపాదనలను వెనక్కి తీసుకుంది. మూడు గ్రామాల్లో 1358 ఎకరాల భూసేకరణ కోసం గతంలో ఇచ్చిన నోటిఫికేషన్లను ఉప సంహరించుకుంది. ఫార్మా విలేజీల కోసం లగచర్లలో 632 ఎకరాలు, హకీంపేట, పోలేపల్లిలో ఫార్మా విలేజీల ఏర్పాటు కోసం జూన్ 7న టీజీఐఐసీ 1358 ఎకరాల భూసేకరణ ప్రతిపాదనలు ఇచ్చింది. టీజీఐఐసీ ప్రతిపాదనల మేరకు పట్టా, అసైన్డు భూముల సేకరించేందుకు తాండూరు ఆర్డీవోను జూన్ 28న భూసేకరణ అధికారిగా వికారాబాద్ జిల్లా కలెక్టర్ గా నియమించారు. పోలేపల్లిలో 71 ఎకరాలు, లగచర్లలో 632 ఎకరాల భూసేకరణకు జులై, ఆగస్టులో అనుమతిచ్చారు. అయితే ఫార్మా పరిశ్రమలపై లగచర్లలో రైతులు ఆందోళన చేయడంతో ప్రభుత్వం పునస్సమీక్షించింది. అక్కడ పెట్టేది ఫార్మావిలేజి కాదని పారిశ్రామిక జోన్ అని ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఫార్మా విలేజీల ఏర్పాటు కోసం భూసేకరణ ఉపసంహరించుకున్నట్లు వికారాబాద్ కలెక్టర్‌కు టీజీఐఐసీ తెలిపింది. ఫార్మా విలేజీల బదులుగా మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు కోసం తాజాగా భూసేకరణ ప్రతిపాదనలు సమర్పించింది. ఈ నేపథ్యంలో గతంలో ఫార్మా సిటీ విలేజీల కోసం ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్లను వెనక్కి తీసుకున్నట్లు వికారాబాద్ కలెక్టర్ పత్రికల్లో ప్రకటనలు జారీ చేశారు. తాజాగా ఇండస్ట్రియల్ పార్కు భూసేకరణ కోసం తాండూరు సబ్ కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ నియమించారు. త్వరలో భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. రైతుల అభిప్రాయాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.



# పెద్దపులి పంజా



**ఆదిలాబాద్, మహా:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెద్ద పులుల సంచారం భయాందోళనలకు గురి చేస్తోంది. తాజాగా ఈ ఉదయం కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గన్నారంలో పెద్దపులి దాడిలో ఓ వివాహిత మృతి చెందటం సంచలనం రేకెత్తించింది. పులుల సంచారం పెరిగినా, అటవీ శాఖ యంత్రాంగం అంటీముట్టనట్లు వ్యవహరిస్తోం దంటూ స్థానికులను ఆందోళనకు దిగారు. కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లే లక్ష్మి పులిదాడిలో ప్రాణాలు కోల్పోయింది. ఉదయం వ్యవసాయ కూలీలతో కలిసి చేనుకు వెళ్లిన లక్ష్మి, పత్తి తీస్తుండగా వెనక నుంచి పెద్దపులి దాడి చేసింది. భయాందోళనలకు గురైన కూలీలంతా అరుపులు, కేకలు వేయటంతో పులి సమీప అటవీ ప్రాంతానికి పారిపోయింది. తీవ్ర గాయాలైన లక్ష్మిని, సహచర కూలీలు, స్థానికులు హుటాహుటిన కాగజ్‌నగర్ తీసుకువెళ్లి చికిత్స అందించారు. ప్రాణాలతో కొట్టుమిట్టాడిన ఆ మహిళ చివరకు తుది శ్వాస విడిచింది. లక్ష్మి మృతదేహాన్ని తీసుకుని, గ్రామస్థులు కాగజ్‌నగర్ అటవీ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. రెండు నెలలుగా పులుల సంచారం ఉందని తెలిసినా, అటవీ అధికారులు పట్టించుకోలేదంటూ ఆరోపించారు.

**మహిళ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం**

పులి దాడి ఘటనపై స్పందించిన అటవీశాఖ, మృతి చెందిన మహిళ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. బాధితులతో ఆసిఫాబాద్ డీఎఫ్‌వో శాంతారాం, కాగజ్‌నగర్ ఆర్డీవో లోకేశ్ చర్చించారు. అంత్యక్రియలకు తక్షణ సాయంగా రూ.20 వేలు ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. మృతురాలి భర్తకు అటవీ శాఖలో వాచర్ ఉద్యోగం ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి 5 ఎకరాలు ఇవ్వాలని సిఫారసు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు శాంతించి మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు.

### కేటీఆర్ నువ్వు జైలుకే

# తొందరెందుకు వెయిట్ అండ్ సీ

(మొదటిపేజీ తరువాయి)

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎందరో విద్యార్థులు మృతి చెందినా, ఏనాడు వారి కుటుంబాలను పరామర్శించిన పాపాన పోలేదన్నారు. ఇటీవల రైలు ప్రమాదంలో విద్యార్థులు మరణిస్తే, మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ లు ఒక్క కన్నీటి చుక్కైనా కార్చారా అంటూ మంత్రి కొండా సురేఖ విమర్శించారు. కవిత జైలు నుండి బయటకు వచ్చిన సమయం నుండి కేటీఆర్ కు టెన్షన్ పట్టుకుందని, కేటీఆర్ మానసిక ఇబ్బందుల్లో ఉన్నట్లు తాను భావిస్తున్నానన్నారు. చెల్లెలిని చూసి కేటీఆర్ భయపడుతున్నట్లు ప్రచారం సాగుతుందని, అసలు రహస్యం బీఆర్ఎస్ నేతలకే ఎరుక అన్నారు. ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనల వెనుక కుట్ర ఉన్నట్లు, ప్రస్తుతం అధికారులు దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో ఆ కుట్ర బయటకు వెళ్లడయ్యే అవకాశాలు ఉన్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. లా అండ్ ఆర్డర్ సమస్యలు క్రియేట్ చేసి పెట్టుబడులు రాకుండా చేసేందుకు చూస్తున్నారని, ఇక్కడ సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నారన్న విషయాన్ని మరచిపోకు కేటీఆర్ అంటూ మంత్రి హెచ్చరించారు.

# అల్లు అర్జున్‌ను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

### సంబరపడుతున్న పుష్ప ఫ్యాన్స్

**హైదరాబాద్, మహా:** పుష్పను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అదేనండీ పుష్ప2 హీరో, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ను సీఎం రేవంత్ రెడ్డి అభినందిస్తూ ట్వీట్ చేశారు. డిసెంబర్ - 5వ తేదీన పుష్ప2 సినిమా భారీ అంచనాల మధ్య విడుదలవుతున్న విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి సూచించినట్లుగానే ఇటీవల పుష్ప2 సినిమా విడుదల సంధర్భంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ డ్రగ్స్ మహమ్మారిపై ఓ వీడియోను విడుదల చేశారు. అల్లు అర్జున్ మాట్లాడుతూ.. యువత మత్తు బారిన పడవద్దని, డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ సహకరించాలని కోరారు. ఇలా అల్లు అర్జున్ వీడియో విడుదల చేయడంపై సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేస్తూ హీరో అల్లు అర్జున్, పుష్ప2 టీమ్ కి అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ట్వీట్ చేసి పుష్పను అభినందించడంతో అల్లు అర్జున్ ఫ్యాన్స్ తమ ఆనందం వ్యక్తం చేస్తూ.. సీఎంకు సోషల్ మీడియా వేదికగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


# అడ్డగోలుగా అనుమతులు

### వెలుగుచూస్తున్న గత బీఆర్ఎస్ ప్రభుత్వ అక్రమాలు

దిలావల్‌పూర్ ఇథనాల్ కంపెనీ ఏర్పాటులోనూ అదే సీన్

ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే ఇథనాల్ కంపెనీ అడ్డదారులు

రేవంత్ సర్కార్ విచారణలో విస్తుపోయే నిజాలు



:2:

The DPE has stated that the fees for application for grant of LOI for ... and manufacture of spirits, fees for transfer of license etc., were fixed in th... and therefore need to be revised. Further stated that keeping in view o... revenue certain amendments are proposed to Telangana Distillery (Manu... Spirits) Rules, 2006 regarding enhancement of fees and issue of Letter of I... new Primary Distilleries in the State. The details of the amendment pr... enclosed herewith.


The DPE has submitted that, the existing (8) primary licenses already ... the excise year 2022-23. In this context it is requested that the proposed ... Distillery Excise Tax should be made applicable to existing distilleries w.e.f. excise year 2023-24. In the event of approval, government will get additional revenue of Rs.16 crores (one time) and Rs.25.38 crores (annually).

With the above, the DPE, Hyd., has submitted that the proposal for amendment to Telangana Distillery (Manufacture of Spirits) Rules, 2006 regarding enhancement of Fees and issue of Letter of Intent for (8) new Primary Distilleries in the State (with amended conditions) are sent to Government for consideration and issue of necessary orders as deemed fit in the matter.

In view of the above, it is submitted for orders whether the proposal of the DPE, Hyd., for amendment to Telangana Distillery (Manufacture of Spirits) Rules, 2006 regarding enhancement of Fees and issue of Letter of Intent to (8) new Primary Distilleries in the State, may be agreed to. Accordingly a draft Memorandum to Council of Minister is placed below for approval. After approval the same may be placed before the Council of Minister for their approval.

After orders are passed, the file may be circulated to the Hon'ble CM through CS / Min (P&E) for approval on Para ( 8 ) above.

Placed before Cabinet for perusal and appropriate decision.



No.31947/Ex.II(2)/2022]

11. Please see orders obtained from the Hon'ble CM through CS / Min (P&E) a... 10 ante and due to exigency, it is for orders whether two (2) draft orders i.e., a... to Telangana Distillery (Manufacture of Spirits) Rules, 2006, regarding enhan... fees and issue of LOI to (7) new Primary Distilleries except for M/s. Sentini Bio ... Ltd., Nalgonda District (due to Model Code of Conduct), is prepared and placed ... approval. pending ratification of the Council of Ministers.

**(నిర్మల్, మహా):**
నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు ఎపిసోడ్‌లో విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తున్నాయి. కంపెనీ భూసేకరణపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తడంతో రేవంత్ సర్కార్ విచారణ చేపట్టింది. ప్రభుత్వ విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. గత ప్రభుత్వ అండతో పీఎంకే డిస్టలరీ కంపెనీ నిబంధనలు తుంగలో తొక్కిందని పేర్కొంది. ఈసీ తీసుకునే విషయంలోనూ సదరు కంపెనీ కేంద్రాన్ని, పర్యావరణ శాఖను మోసం చేసినట్లు గుర్తించింది. 2023, డిసెంబర్ 7కు ముందే టీఎస్-ఐపాస్ ద్వారా ఆ కంపెనీకి అనుమతులు జారీ అయినట్లు సర్కార్ వెల్లడించింది. పీఎంకే డిస్టిలేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఫ్యూయల్ ఇథనాల్‌కు మాత్రమే కేంద్రం అనుమతి ఇచ్చింది.. కానీ ఇథనాల్, ఎక్స్ ట్రా న్యూటల్ ఆల్కహాల్, ఇండస్ట్రియల్ స్పిరిట్స్, అబ్జల్యూట్ ఆల్కహాల్ లాంటి అన్ని ఉత్పత్తులకు అప్పటి మంత్రివర్గం అనుమతి ఇవ్వడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్న పరిస్థితి.

### ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే..

కేసీఆర్ ప్రభుత్వం పీఎంకే కంపెనీకి అనుకూలంగా మంత్రివర్గంలోనే అడ్డగోలు అనుమతులు జారీ చేసిందని రేవంత్ సర్కార్ వెల్లడించింది. ఫ్యూయల్ ఇథనాల్ సాకు చూపించి ఏకంగా ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా మినహాయింపు పొందేందుకు ఇథనాల్ కంపెనీ అడ్డదారులు తొక్కినట్లు గుర్తించింది. కేంద్రం ఇచ్చిన పర్యావరణ అనుమతి ప్రకారం అక్కడి స్థానిక సంస్థల నుంచి ఎన్‌వోసీ తీసుకోవడం తప్పనిసరి. ఎన్‌వోసీ తీసుకోకుండానే పీఎంకే డిస్టిలేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ.. అప్పట్లోనే ప్రహరి నిర్మించేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అండదండలతోనే పర్యావరణ అనుమతుల నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించిందనేది సర్కార్ వారి మాట.

### కేబినెట్ అనుమతి లేకుండానే...

2022, అక్టోబర్ 22న 600 లక్షల లీటర్ల ఇథనాల్ / ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ / ఇండస్ట్రియల్ స్పిరిట్స్ / అబ్సల్యూట్ ఆల్కహాల్ తయారీకి లెటర్ ఆఫ్ ఇండెంట్ కేసీఆర్ ప్రభుత్వం జారీ చేసింది. అప్పటి ప్రభుత్వం కేబినేట్ ఆమోదం లేకుండానే అత్యవసరం పేరిట ఆదేశాలు జారీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. 2022 డిసెంబర్‌లో ఆ నిర్ణయాన్ని కేసీఆర్ కేబినెట్ ర్యాటిఫై చేసింది. ఇథనాల్ తయారీకి కేంద్ర ప్రభుత్వంతో పాటు పర్యావరణ అనుమతి తప్పనిసరి. ఇథనాల్ / ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ / ఇండస్ట్రియల్ స్పిరిట్స్ / అబ్సల్యూట్ ఆల్కహాల్ తయారీకి పీఎంకే డిస్టిలేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ లెటర్ ఆఫ్ ఇండెంట్ తీసుకుంది.. కానీ కేంద్ర పర్యావరణ శాఖకు మాత్రం'ఫ్యూయల్ ఎథనాల్' కోసమే దరఖాస్తు చేసినట్లు విచారణలో బయటపడింది. అక్కడ ప్రతిపాదించిన 300 కేఎన్ పీడీ సామర్థ్యం మొత్తం 'ఫ్యూయల్ ఇథనాల్' తయారీకేనని కంపెనీ స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించింది. కంపెనీ సమర్పించిన స్వీయ ధ్రువీకరణ ఆధారంగా ఈ ఫ్యాక్టరీ బీ2 కేటగిరీకి వస్తుందని.. ప్రజాభిప్రాయ సేకరణ నుంచి అప్పటి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. 2023 ఫిబ్రవరి 24కేంద్ర పర్యావరణ శాఖ కేవలం ఫ్యూయల్ ఇథనాల్ ఉత్పత్తికి మాత్రమే అనుమతి ఇచ్చింది. కానీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2023 ఏప్రిల్ 1న ఆ ఫ్యాక్టరీకి ఇచ్చిన లెటర్ ఆఫ్ ఇండెంట్లో ఫ్యూయల్ ఇథనాల్‌కు పరిమితం కాలేదు. మిగతా ఉత్పత్తులన్నీ జోడించిన లెటర్ ఆఫ్ ఇండెంట్‌ను కేసీఆర్ ప్రభుత్వం జారీ చేసింది.

### నిబంధనల ఉల్లంఘన..

కొత్త లెటర్ ఆఫ్ ఇండెంట్‌ను చూపించి 2023 జూన్ 7న ఇథనాల్ / ఎక్స్‌టా న్యూట్రల్ ఆల్కహాల్/ ఇండస్ట్రియల్ స్పిరిట్స్ / అబ్సల్యూట్ ఆల్కహాల్ ఉత్పత్తుల తయారీ లైసెన్స్‌కు పీఎంకే కంపెనీ దరఖాస్తు చేసుకుంది. పర్యావరణ శాఖ అనుమతి ప్రకారం అక్కడి స్థానిక సంస్థల నుంచి నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్ తీసుకోవటం తప్పనిసరి. కానీ పీఎంకే డిస్టిలేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ స్థానికంగా అనుమతి తీసుకోకుండానే కాంపౌండ్ వాల్ నిర్మించేసింది. దీంతో పర్యావరణ అనుమతుల నిబంధనలను ఉల్లంఘించింది సదరు కంపెనీ. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన లెటర్ ఆఫ్ ఇండెంట్ ఆధారంగా 2023 జూన్ 15న ఇరిగేషన్ డిపార్టుమెంట్ ఆదిలాబాద్ చీఫ్ ఇంజనీర్ విభాగం నీటి కేటాయింపులకు అనుమతి ఇచ్చినట్లు విచారణలో అధికారులు గుర్తించారు.

# కాపాడండి..!

### అమెరికా ప్రభుత్వానికి ప్రభాకర్‌రావు పిటిషన్

రాజకీయ శరణార్థిగా గుర్తించాలంటూ విన్నపం

తెలంగాణలో కీలక అధికారిగా పనిచేశానంటూ వినతి

తీవ్ర అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నట్లు వేడుకోలు

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు



**(హైదరాబాద్, మహా):** తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు అనేక మలుపులు తిరుగుతోంది. ఈ కేసు నుంచి బయటపడేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు. లేటెస్ట్‌గా ఆయన యూఎస్ ప్రభుత్వానికి ఓ దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలని అందులో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతోంది. దీన్ని పసిగట్టిన కొంతమంది నేతలు, తెర వెనుక నుంచి తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు ఇండియాకు రాకుండా ఉండేలా పావులు కదుపుతున్నారన్న ప్రచారం సాగుతోంది.

**ఇప్పటికే గ్రీన్‌కార్డు ..**

ఇప్పటికే అమెరికాలో గ్రీన్‌కార్డు దక్కించుకున్న ప్రభాకర్‌రావు, మరో అడుగు ముందు కేశారు. ఈ క్రమంలో యూఎస్ ప్రభుత్వానికి ఓ దరఖాస్తు పెట్టుకున్నారు. అందులో కీలక సారాంశం ఏంటంటే.. తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో తాను కీలక స్థానంలో పని చేశానని ప్రస్తావించారు. రాజకీయంగా తనను అక్కడి ప్రభుత్వం వేధిస్తుందని పేర్కొన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నానని, ఫ్లోరిడాలో తన కుమారుడి వద్ద ఉంటున్నానని రాసుకొచ్చారు.

**ఇండియాకు రప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు..**

ప్రభాకర్‌రావు దరఖాస్తుపై అమెరికా ప్రభుత్వం ఎలాంటి రిప్లై ఇస్తుందో చూడాలి. లేదంటే భారత ప్రభుత్వాన్ని సంప్రదించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటుందా? అనేది చూడాలి. మరోవైపు అమెరికాలో తలదాచుకుంటున్న ప్రభాకర్‌రావుని ఇండియాకు రప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది తెలంగాణ సర్కార్. దీనికి సంబంధించి విదేశీ వ్యవహారాల శాఖతో మంతనాలు జరుపుతోంది. ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించేందుకు అధికారులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

# డిసెంబర్ 4న పెద్దపల్లిలో సీఎం సభ

## సభా ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మహా :** డిసెంబర్ 4 వ తేదీన పెద్దపల్లిలో నిర్వహించే యువ శక్తి సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై దాదాపు 9000 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందచేస్తారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. పెద్దపల్లిలో డిసెంబర్ 4 వ తేదీన తలపెట్టిన ముఖ్యమంత్రి సభా ఏర్పాట్లపై సాయంత్రం సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్త, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు శ్రీధర్, సందీప్ సుల్తానియా, క్రిస్టినా చోంగ్తు, ఫైర్ సర్వీసుల డీజీ నాగిరెడ్డి, అడిషనల్ డీజీ మహేష్ భగవత్, సి.ఎం.ఓ అధికారి వేముల శ్రీనివాసులు, సమాచార శాఖ ప్రత్యేక కమీషనర్ హరీష్, విద్యా శాఖ డైరెక్టర్ వెంకట నర్సింహా రెడ్డి, పెద్దపల్లి కలెక్టర్ హర్ష, రామగుండం పోలీస్ కమీషనర్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో యువత కై ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ సభలో ఇటీవల గ్రూప్ IV లో ఎంపికైన 8143 మందికి, 442 సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, సింగరేణిలో ఉద్యోగాలు పొందిన వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి నియామక పత్రాలను అందచేస్తారని వివరించారు. ఈ సభలోనే స్కిల్ యూనివర్సిటీలో బాగస్వామ్యమయ్యే 7 ఏజెన్సీలతో ఒప్పంద పత్రాలను సంతకం చేయడం జరుగుతుందని,, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ప్రారంభోత్సవం, సి.ఎం కప్ ప్రారంభం లతో పాటు వందలాది కోట్ల రూపాయల విలువైన అనేక కార్యక్రమాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. వివిధ రంగాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను తెలియచేసే దాదాపు 40 స్టాళ్లను ఈ సభా వేదిక వద్ద ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే, వరంగల్, మహబూబ్ నగర్ లో మాదిరిగానే పెద్దపల్లి సభకు విస్తృత ఏర్పాట్లను చేయాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు.



తుర్కియే రాయబారి ఫిరాట్ సునెల్, కాన్సుల్ జనరల్ ఓర్హాన్ యమన్ ఓకన్‌తో సమావేశమైన మంత్రి శ్రీధర్ బాబు

# అక్రమాలపై పవన్ ఉక్కుపాదం

## కాకినాడ పోర్టును స్మగ్లింగ్ కు అడ్డాగా మార్చేశారు

### అధికారుల నిర్లక్ష్యంతో దేశభద్రతకు తీవ్ర ముప్పు

### మొత్తం నెట్ వర్క్‌ను బ్రేక్‌డౌన్ చేస్తాం..

### పీడీఎస్ బియ్యంతో ఉన్న షిప్ సీజ్ చేయండి

### కాకినాడ పోర్టులో పట్టుబడిన రేషన్ బియ్యం

### అధికారుల తీరుపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆగ్రహం



**కాకినాడ పోర్టును స్మగ్లింగ్ హబ్‌గా మార్చేశారు**

కాకినాడ పోర్టును స్మగ్లింగ్ కు అడ్డాగా మార్చేశారని, పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని కొంత మంది అక్రమార్కులు స్మగ్లింగ్ చేస్తూ కోట్లు కూడబెడుతున్నారన్నారు. రేషన్ మాఫియా వెనుక ఎవరున్నా వదిలిపెట్టం, మొత్తం నెట్ వర్క్‌ను బ్రేక్ డౌన్ చేస్తామన్నారు. రేషన్ బియ్యం పేదప్రజలకు మాత్రమే అందాలని, ప్రైవేట్ పోర్టు అయితే ఏదైనా చేయవచ్చనుకుంటున్నారేమో కూటమి పాలనలో అటువంటివి కుదరవని స్పష్టం చేశారు.

**కాకినాడ, మహా :** 'కాకినాడ పోర్టును స్మగ్లింగ్ కు అడ్డాగా మార్చేశారు. ఇక్కడ నుంచి ఇంత భారీగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రశ్నించారు. తీర ప్రాంతంలో అక్రమ రవాణా విషయంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందితే అది దేశ భద్రతకే భంగం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోర్టు నుంచి ఇంత పెద్ద ఎత్తున రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నప్పుడు, భవిష్యత్తులో పేలుడు పదార్థాలు, మత్తు పదార్థాలు అక్రమ రవాణా దిగుమతి కావని గ్యారంటీ ఏంటి? ఈ అక్రమ మార్గాల్లో కసబ్ వంటి ఉగ్రవాదులు వచ్చే ప్రమాదం ఉండదా? అని అధికారులను నిలదీశారు. కాకినాడ పోర్టు నుంచి జరుగుతున్న అక్రమ రవాణా కార్యకలాపాలపై కేంద్రం, దర్యాప్తు సంస్థల దృష్టికి తీసుకెళ్తానన్నారు. శుక్రవారం కాకినాడ యాంకరేజ్ పోర్టులో రేషన్ బియ్యంతో పట్టుబడిన స్టెల్లా ఎల్ నౌక వద్దకు రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రితో నాదెండ్ల మనోహర్ తో కలిసి ప్రత్యేక బోట్‌లో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, కాకినాడ పోర్టు అంటే స్మగ్లర్లకు స్వర్గధామంగా మారిపోయిందన్నారు. బియ్యం అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని చెబుతున్నా క్షేత్ర స్థాయి అధికారులకి ఇంకా మెతగ్గా ఉంటున్నారని మండిపడ్డారు. స్మగింగ్ చేసేవాడు ఒక్క బియ్యంతో ఆగడు, మత్తు పదార్థాలు, పేలుడు పదార్థాలను కూడా స్మగ్లింగ్ చేస్తాడు, రాజకీయ ఒత్తిళ్లు అని అధికారులు నిర్లక్ష్యం వహిస్తే అది దేశ భద్రతకే పెనుముప్పు గా మారుతుందని హెచ్చరించారు.

**ప్రతిసారీ ప్రజా ప్రతినిధులు వచ్చి ఆపాలా ?**

కాకినాడ చుట్టు పక్కల చాలా జాతీయ సంస్థలు, పెద్ద పెద్ద కంపెనీలున్నాయి. అక్రమ రవాణా మార్గాల్లో ప్రమాదకర శక్తులు వస్తే ఆయా సంస్థలు, కంపెనీల రక్షణకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితులు ఉంటే ఉగ్రవాదులను రెడ్ కార్పెట్ వేసి పిలిచినట్లే. ప్రతిసారీ ప్రజాప్రతినిధులు వస్తేనే బియ్యం అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటారా..? రేషన్ బియ్యం మాఫియా వెనుక ఉన్న బోటు ఓనర్లు, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులు, దీని వెనకున్న శక్తులపై కేసులు నమోదు చేయండి. దీని వెనుక ఉన్నది ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.

**నేను వస్తున్నానంటే ఎస్పీ సెలవు మీద వెళ్లిపోయారు**

రేషన్ బియ్యం ఒక్కటే ఇక్కడ స్మగ్లింగ్ జరుగుతుందో... ఇంకేదైనా జరుగుతున్నాయో ఎవరికి తెలుసు? ఇక్కడ నుంచి ఎంత గంజాయ్ బయటకు వెళ్తుందో ఎవరికి తెలుసు? అక్రమార్కులపై స్థానిక ప్రజాప్రతినిధులు కూడా దృష్టి సారించాలని పవన్ స్పష్టం ఛేశారు. షిప్ సీజ్ చేసి... దీని వెనుక ఉన్నదెవరు నివేదిక ఇవ్వాల"ని అధికారులను ఆదేశించారు. నే వస్తున్నట్లు తెలిసిన తర్వాత ఎస్పీ సెలవుపై వెళ్ళడం పట్ల పవన్ అనుమానం వ్యక్తం చేశారు.

# ఖమ్మంలో ఘనంగా దీక్షా దివస్



**ఖమ్మం, నవంబర్ 29, మహా:** బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీక్షా దివస్ వేడుకలో భాగంగా తెలంగాణ ఉద్యమకారులు, మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యక్రమ ఇంచార్జ్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్రావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, బానోతు చంద్రావతి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, అనుగుల రాకేష్ రెడ్డి, కూరాకుల నాగభూషణం, ఆర్.జె.సి కృష్ణ, బెల్లం వేణుగోపాల్ తదితరులు ఎన్టీఆర్ సర్కిల్లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలాభిషేకం చేశారు. అనంతరం తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద ఉద్యమ అమరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు ఉప్పుల వెంకటరమణ, బొమ్మెర రామ్మూర్తి, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, కోడిరెక్క ఉమాశంకర్, నెల్లూరి అచ్యుతరావు, ఆసిఫ్ అహ్మద్, బూరాన్, నాగుల్ మీరా, సద్దాం షేక్, బీఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పోటు ప్రసాద్ అజరామరుడు

## త్యాగాల గని - పోరాటాల ముద్దుబిడ్డ

### పోటు ప్రసాద్ సంతాప సభలో వక్తలు



**ఖమ్మం సిటీ, నవంబర్ 29, మహా:** త్యాగాలకు చిరునామాగా నిలిచిన పోటు ప్రసాద్ అజరామరుడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎర్ర జెండా ఉన్నంత కాలం పోరాడే వారి ప్రతి గుండెల్లోనూ పోటు ప్రసాద్ చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఆయన తెలిపారు. బుధవారం పోటు ప్రసాద్ సంతాప సభ శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ అసలైన కమ్యూనిస్టుకు పర్యాయ పదంగా పోటు ప్రసాద్ నిలిచారని కమ్యూనిస్టు ఎలా ఉండాలో, ఎలా పనిచేయాలో ప్రసాద్ అలా పనిచేశారని ఆయన తెలిపారు. దినదిన ప్రవర్ధమానమై దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద సంస్థలుగా కీర్తి గడించిన మమత సంస్థల ఏర్పాటుకు అంకురార్పణ చేసినవాడు పోటు ప్రసాద్ అని రాష్ట్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. పోటు ప్రసాద్ సంపూర్ణ కమ్యూనిస్టు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. ఈ సంతాప సభలో పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, నీటి పారుదల, అభివృద్ధి కార్పోరేషన్ ఛైర్మన్ మువ్వా విజయ్ బాబు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాలమల్లేష్, కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సీపీఐ (ఎంఎల్) మాస్లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్, సీపీఐ సీనియర్ నాయకులు పాకాలపాటి వెంకటేశ్వరరావు, మహ్మద్ మౌలానా, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, టీడీపీ జిల్లా కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ఎంఎల్ పార్టీ నాయకులు విజయ్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెంజిల్లా కార్యదర్శి ఎస్కో సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, పలు జిల్లాల కార్యదర్శులు, కమ్యూనిస్టు పార్టీ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు, ప్రసాద్ తనయుడు సాత్విక్, సోదరి పోటు కళావతి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, ఎస్కే జానిమియా, సిద్ధినేని కర్ణకుమార్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ బాధ్యులు రామకృష్ణ, పుట్టా లక్ష్మణ్, ఆరికె తదితరులు ప్రసంగించారు.

# అమెరికా విద్యార్థులు అలర్ట్

## త్వరగా వచ్చేయాలన్న యూనివర్సిటీలు

### జనవరి 20 న ట్రంప్ ప్రమాణ స్వీకారం

### ఆలోపే రావాలంటూ లేఖలు రాస్తున్న విశ్వవిద్యాలయాలు

**న్యూయార్క్, మహా :** అమెరికాలో ఎన్నికలు పూర్తయి, ఫలితాలు వెలువడ్డాయి. అధ్యక్ష పీఠాన్ని అధిష్టించేందుకు కావాల్సిన మెజారిటీ సీట్లను డోనాల్డ్ ట్రంప్ దక్కించుకున్నారు. దీంతో ఆయన జనవరి 20 వ తేదీన అధ్యక్ష పీఠం బాధ్యతలను చేపట్టనున్నారు. ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి సమయం సమీపిస్తున్ననేపథ్యంలో వెను వెంటనే ఆయన నిర్ణయాలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు శ్రకారం చుట్టనున్నారన్న ప్రచారం జోరందుకుంది. విదేశీ విద్యార్థులు, అక్రమంగా అమెరికాలో తిష్ట వేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తానన్న ట్రంప్ నిర్ణయాలు వెంటనే అమల్లోకి వస్తే పరిస్థితులు ఎలా ఉంటాయన్న చర్చ కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయాలలో చదువుతున్న విద్యార్థులందరూ జనవరి 20 తేదీ అంటే ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముందే అమెరికా రావాలంటూ లేఖలు లర్సుత్నరాస్తున్నాయి. భారత విద్యార్థులతో పాటు ప్రపంచంలోని వేర్వేరు దేశాలకు చెందిన విద్యార్థులకు యూనివర్సిటీలు ఈ మేరకు లేఖలను పంపించాయి. భారత విద్యార్థులతో పాటు ఇతర దేశాల విద్యార్థులకు అక్కడి యూనివర్సిటీ లు కీలక సూచనలు కూడా చేస్తున్నాయి, శీతకాలం సెలవుల కు వెళ్లిన విద్యార్థులు ట్రంప్ అధ్యకుడిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే (జనవరి 20) అమెరికా వచ్చేయాలని మెసేజ్ లు పంపుతున్నారు, వ్యాలిడ్ వీసా లు ఉన్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకున్నా, ట్రంప్ విధానాలపై ఆందోళనతో ఎలాంటి ఛాయిస్ తీసుకోవద్దని యూనివర్సిటీ లు భావిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# సీఎం రేవంత్ రెడ్డికి ప్రశంసల పరంపర



**కల్లూరు, నవంబర్ 29, మహా:** గత ప్రభుత్వంలో గిట్టుబాటు ధర లేక తరుగు పేరుతో మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టేవారని, ధాన్యం డబ్బులకు నెలలు పొడవునా తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు రైతులకు ఆ పరిస్థితి లేకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధాన్యానికి గిట్టుబాటు ధరతోపాటు సన్నవడ్లకు 500 రూపాయలు బోనస్ ఇచ్చి రైతులు జీవితాల్లో ఆనందం చూశారని ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఆయన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో రైతులు పండించిన పంటలో ప్రతి గింజను ఈ ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా ఐకేపీ సెంటర్ లు, డీసీఎంఎస్ ద్వారా, సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుకు మద్దతు ధర ఇవ్వడం జరుగుతుందని, ఆన్లైన్ చేసిన 48 గంటల్లో డబ్బులు వారి ఖాతాలలో జమవుతున్నాయని అన్నారు. గతంలో ఈ మండలంలో డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేవని, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని మండలంలో నాలుగు సెంటర్లు ఏర్పాటు చేశారని అన్నారు. రైతును రాజుని చేయాలనే సంకల్పంతో జిల్లాలో ఉన్న మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేకమైన చొరవ చూపుతున్నారన్నారు.

# పట్నం నరేందర్ రెడ్డికి బిగ్ రిలీఫ్

## రెండు కేసులు కొట్టేసిన హైకోర్టు

### ఒకే ఘటనలో వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు ఎందుకన్న హైకోర్టు





**హైదరాబాద్, మహా :** లగచర్ల దాడి ఘటనలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిపై నమోదైన మూడు కేసులలో రెండు కేసులను హైకోర్టు కొట్టివేసింది. బోంరాస్‌పేట పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసుల్లో రెండింటిని కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లగచర్లలో అధికారులపై జరిగిన దాడిలో బోంరాస్‌పేట పోలీసులు కేసులు నమోదు చేశారు. మొదట ఒక కేసు నమోదు చేసిన అధికారులు.. అనుబంధంగా మరో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ మూడు కేసుల్లోనూ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని నిందితుడిగా చేర్చారు. పోలీసులు మూడు కేసులు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ పట్నం నరేందర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ నిర్వహించారు. ఒకే ఘటనలో వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయొద్దని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందని పిటీషనర్ తరఫు న్యాయవాది రమణ కోర్టుకు తెలిపారు. ఈ మేరకు తీర్పు కాపీలను చదివి వినిపించారు. ఇదే హైకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని వాదించారు. నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా మరో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాల్సి వచ్చిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో గత వారం తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు ఈ రోజు ఉత్తర్వులు వెలువరించింది. హైకోర్టు తీర్పుతో పట్నం నరేందర్ రెడ్డికి ఊరట లభించింది.

**ఇదీ జరిగింది**

లగచర్ల ఘటనలో పోలీసులు కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. పోలీసుల రిమాండ్ రిపోర్టును పరిగణలోకి తీసుకున్న కొడంగల్ కోర్టు.. నిబంధనలకు విరుద్ధంగా రిమాండ్ విధించిందని, ఆ ఉత్తర్వులను కొట్టేయాలని పట్నం నరేందర్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. నరేందర్ రెడ్డి అరెస్టును హైకోర్టు తప్పుపట్టింది. మాజీ ఎమ్మెల్యేను ఓ ఉగ్రవాదిలా అరెస్టు చేయాల్సిన అవసరం ఏం వచ్చిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. దాడికి గురైన వారికి తగిన గాయాలేమో స్వల్పంగా ఉన్నట్లు వైద్యులు నివేదిక ఇచ్చారని, కానీ పోలీసులు మాత్రం గాయాలు తీవ్రంగా ఉన్నాయని రిపోర్టులో పేర్కొన్నారని హైకోర్టు తప్పుపట్టింది.



# విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ

**ఖమ్మం, నవంబర్ 29, మహా:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కామేపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. కామేపల్లి మండలంలోని ముచ్చెర్ల, కొత్తలింగాల గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి క్రింద ఏర్పాటు చేసిన నూడుల్స్ తయారీ, పౌల్ట్రీ, పండ్లకు సంబంధించిన మొదలగు యూనిట్లు, సింగరేణి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను, జడ్పీ హెచ్ఎస్ స్కూల్ ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద గ్రామాలలో ఏర్పాటు చేసిన వ్యాపార యూనిట్లు లాభసాటిగా నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు తయారు చేసే నూడుల్స్, పౌల్ట్రీ మొదలగు అంశాలకు మంచి మార్కెట్ ఉండే విధంగా చూడాలని అన్నారు.

# ఖమ్మంలో బైక్ ర్యాలీ



**ఖమ్మం, నవంబర్ 29, మహా:** కేసీఆర్ దీక్షా దివాస్ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి, అమరవీరుల స్థూపం వద్ద అమరరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ అనాడు 29 నవంబర్ 2009న కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో చేపట్టిన దీక్షను భగ్నం చేసి దీక్ష చేయకుండా కేసీఆర్ ని అరెస్ట్ చేసి ఖమ్మం జైలుకు తరలించారన్నారు. కేసీఆర్ జైలులో ఉండగా కలవడానికి వెళ్లిన పువ్వాడ నాగేశ్వరరావుతో తెలంగాణ వచ్చేదాకా వెనక్కితగ్గేదే లేదని కేసీఆర్ అన్నారని గుర్తుచేశారు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ రాష్ట్రం సాధించిన తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని పువ్వాడ అన్నారు.

# పద్మావతి సేవలు మరవలేనివి

## గూడవల్లి రామ్ బ్రహ్మం



**నేలకొండపల్లి, నవంబర్ 29 మహా:** కందిమళ్ల పద్మావతి సేవలు మరవలేనివి అని రామచంద్రాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ గూడవల్లి రామ్ బ్రహ్మం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వాసవి భవన్ లో శుక్రవారం రిటైడ్ ప్రభుత్వ ఉద్యోగి కందిమళ్ల పద్మావతి ఆరో వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగిగా సేవలు అందించటమే కాకండా... సేవా కార్యక్రమాలు చేసి ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఆమె చూపిన బాటలోనే భర్త హరిబాబు సేవా కార్యక్రమాలు చేపడుతుండటం ప్రశంసనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ రాయపూడి నవీన్, ఉప సర్పంచ్ లక్కం ఏడుకొండలు, వివిధ పార్టీల నాయకులు జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, పావులూరి.వెంకటేశ్వరరావు, రేగూరి హనుమంతరావు, దోసపాటి శేఖర్, పేరాల గాంధీ, కడియాల నరేష్, గుడిపాటి ముక్కంటి, కె.వీ.చారీ, కొత్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.

EDITORIAL ఎడిటోరియల్

# వాయుకాలుష్యం పెనుసవాల్

ప్రపంచానికి వాయికాలుష్యం పెనుసవాల్ విసురుతోంది. వాయు కాలుష్యం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 15 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని నివేదికలు రావడం అత్యంత ఆందోళనకరం. ప్రస్తుతం వాయు కాలుష్యం రోజురోజుకు పెరుగుతోంది. పరిశ్రమలతో పాటు కార్చిచ్చు కూడా గాలి కాలుష్యానికి కారణమవుతోందని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. వందల ఎకరాల్లో అడవులు కాలిపోవడం, అలాగే పంట వ్యర్థాలను తగలబెట్టడంతో గాలి నాణ్యత రోజురోజుకీ క్షీణిస్తోంది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 15 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాల్లో వాయి కాలుష్యం ఎక్కువగా జరుగుతోంది. ది లాన్సెట్ జర్నల్ చేసినటువంటి తాజా అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అడవిలో చెలరేగే మంటలు, వ్యవసాయ భూముల్లో పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల గాలి కాలుష్యం ఎక్కువగా పెరుగుతోంది. 20002019 మధ్య ఈ కార్చిచ్చు గాలి కాలుష్యం వల్ల ప్రతీ సంవత్సరం 4,50,000 మంది గుండె జబ్బులతో, మరో 2,20,2000 మంది శ్వాసకోస సంబంధిత సమస్యలతో ప్రాణాలు కోల్పోయారు. ఈ మరణాల్లో 90 శాతం పేద, మధ్యతరహా ఆదాయం ఉన్న దేశాల్లోనే జరిగాయి. కేవలం ఆఫ్రికాలోనే 40 శాతం మరణాలు చోటుచేసుకున్నాయి. భారత్, చైనా, ఇండోనేషియా, నైజీరియా, కాంగో దేశాల్లో అత్యధిక మరణాలు జరిగాయని'' పరిశోధకుల బృందం వివరించింది. రానున్న రోజుల్లో ఈ మరణాల సంఖ్య మరింత పెరిగే ఛాన్స్ ఉందని నిపుణులు వార్నింగ్ ఇస్తున్నారు. ఈ మరణాల సంఖ్యను తగ్గించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలంటూ సూచనలు చేస్తున్నారు . ఆసియాలో జన సాంద్రత అత్యంత ఎక్కువగా ఉండే రెండు రాజధాని ప్రాంతాలను విషపూరిత పొగ కమ్మేస్తోంది. ఇది ప్రజలకు ప్రాణాంతకంగా మారుతోంది. జనాభా రెండు కోట్లకు పైగా ఉండే ఢిల్లీ, బీజింగ్‌లలో ప్రజలు పొగనే పీల్చుకుంటున్న దుస్థితి చూస్తున్నాం. ప్రాణాంతక పొగమంచు విపత్తుకు బీజింగ్ వాసులు 'ఎయిర్‌పోకలిప్స్' అనే పేరు కూడా పెట్టారు. ఢిల్లీ నగరంలో ఇప్పుడు పొగమంచు కాలం వచ్చేసింది. అయితే, దిల్లీతో పోలిస్తే బీజింగ్ ప్రజలు కాస్త మెరుగైన గాలిని పీల్చుకోగలుగుతున్నారు. గతంలో ఇదే స్థాయిలో గాలి కాలుష్యాన్ని ఎదుర్కొన్న బీజింగ్ నగరం ఇప్పుడు మెరుగుపడింది. ఢిల్లీ మాత్రం ఆ స్థాయిలో కాలుష్యాన్ని కట్టడి చేయలేకపోయింది. ప్రపంచం ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాలి. ఇటీవల జరిగిన జి 20లోనూ వాతావరణ పరిస్థితులు, వైపరీత్యాలపై చర్చ జరిగింది. కాలుష్య నివారణ చర్యలు చేపట్లాలి. ప్రపంచవ్యాప్తంగా మెరుగైన పద్ధతులపై అధ్యయనం, ఆచరణ జరగాలి.



## విద్యుత్తు రంగంలో
# కొత్త వెలుగులు


### అర కోటి పేద కుటుంబాల్లో గృహజ్యోతి..
### తెలంగాణ తలెత్తుకునేలా నిర్ణయాలు.. అవకతవకలపై.. విచారణ
### రైతుల సంక్షేమమే లక్ష్యంగా రూ. 10,444 కోట్లు ఉచిత విద్యుత్తు సబ్సిడీ భారం భరించిన ప్రభుత్వం



**మహా:** విద్యుత్తు రంగంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సరికొత్త మార్పులు తీసుకొచ్చింది. పదేండ్ల అవకతవకలకు ప్రజా ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. విద్యుత్తు సంస్థల పేరిట రూ.83 వేల కోట్ల అప్పులు చేసి ఆస్తులన్నీ తాకట్టు పెట్టిన దుస్థితి నుంచి తెలంగాణ మళ్లీ తలెత్తుకునే నిర్ణయాలు తీసుకుంది. రైతులకు, నిరుపేదలకు లాభసాటిగా ఉండే పథకాలను కొనసాగిస్తూనే విద్యుత్తు రంగాన్ని పునరుద్ధరించే ప్రయత్నం చేసింది. ట్రాన్స్కో, జెన్కోతో పాటు డిస్కంలు.. విద్యుత్తు సంస్థన్నింటా దుబారాను తగ్గించి విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం పెంచేందుకు అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. భవిష్యత్తు విద్యుత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో కొత్త పునరుజ్జీవ ఇందన విధానం రూపొందిస్తోంది. దివాళా బాటలో ఉన్న విద్యుత్తు సంస్థలను గాడిలో పెట్టేందుకు తొలి ఏడాదిలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మక విధానాలు అనుసరించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి భారీ అప్పులు, వేల కోట్ల నష్టాలతో విధ్వంసమైన తీరుపై శ్వేత పత్రం విడుదల చేశారు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, గతంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్లలో జరిగిన అవకతవకలపై విచారణకు ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్ను ఏర్పాటు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకాన్ని నిరాటంకంగా కొనసాగించింది. రైతుల సంక్షేమమే లక్ష్యంగా తొలి ఏడాదిలోనే రూ. 10,444 కోట్లు ఉచిత విద్యుత్తు సబ్సిడీ భారాన్ని భరించింది. దాదాపు 29 లక్షల మంది రైతులు ఉచిత కరెంట్ ద్వారా లబ్ధి పొందారు. గత పదేండ్లలో దాదాపు రూ.20 వేల కరెంటు ఛార్జీల మోత మోసిన ప్రజలకు ప్రజా ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. కరెంట్ ఛార్జీలను పెంచకుండా రాష్ట్రంలో 1.85 కోట్ల మంది వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసింది.

ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం గృహజ్యోతి పథకాన్ని ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. 200 యూనిట్లలోపు విద్యుత్తు వాడే వినియోగదారులకు విద్యుత్తు అందిస్తోంది. మార్చి నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 50 లక్షల కుటుంబాలు జీరో బిల్లులు అందుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థలన్నింటికీ ఉచిత విద్యుత్తు అందించే మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 39067 విద్యా సంస్థలకు ఉచిత విద్యుత్తును అందిస్తోంది. దీనికి ప్రభుత్వం రూ. 101.57కోట్ల సబ్సిడీ విడుదల చేసింది. రోజువారీ అత్యధిక విద్యుత్తు డిమాండ్లో తెలంగాణ చరిత్రలోనే మొదటిసారిగా పెద్ద రాష్ట్రాలను సైతం అధిగమించింది. గత ఏడాది 2023 ఆగస్టులో గరిష్ఠ విద్యుత్తు డిమాండ్లో ఎనిమిదో ర్యాంకులో ఉన్న తెలంగాణ రాష్ట్రం ఈ ఏడాది అయిదో ర్యాంకుకు చేరింది. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 15,623 మెగావాట్ల ఆల్ టైమ్ హై పీక్ డిమాండ్ విద్యుత్తును సమర్థంగా సరఫరా చేసి కొత్త రికార్డు నెలకొల్పింది. గత ప్రభుత్వపు అనాలోచిత నిర్ణయాలతో ఏళ్లకేళ్లు ఆలస్యమైన యాదాద్రి థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం పనులను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. మొదటి దశలోని రెండు యూనిట్ల నిర్మాణ పనులు ఇటీవలే పూర్తయ్యాయి. సెప్టెంబర్ 12న యూనిట్ 1, 2 గ్రిడ్కు అనుసంధానం చేశారు. ప్రజా విజయోత్సవాల్లో భాగంగా 800 మెగావాట్ల ఒక యూనిట్లో వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించనున్నారు. దేశంలోనే వినూత్నంగా మహిళా శక్తి సంఘాల అధ్వర్యంలో 4000 మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఒక్కో సంఘం అధ్వర్యంలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఒక్కో మెగావాట్ ఉత్పత్తి అయ్యేలా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో ఎంపిక చేసిన అయిదు గ్రామాల్లో నూటికి నూరు శాతం సౌర విద్యుత్తు వినియోగించే మోడల్ ప్రాజెక్టును చేపట్టింది. రెప్పపాటు కోత లేకుండా నిరంతరాయంగా విద్యుత్తు అందించేందుకు, ఎక్కడైనా సాంకేతిక సమస్యలు తలెత్తినా వెంటనే విద్యుత్తును పునరుద్ధరించేందుకు ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వెహికల్స్ ను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలో అవసరమైన చోట్ల 244 కొత్త సబ్ స్టేషన్లను నెలకొల్పుతోంది. ఇలా విద్యుత్ రంగాన్నిసమర్థనిర్వహణతో ముందుకు తీసుకువెళ్తోంది.

# మాకు పెళ్లొద్దు సామీ...!
## దేశంలో కొత్త సమస్య
### పెళ్లికి నిరాకరిస్తున్న యువత
### సోలో లైఫే సో బెటరంటున్న వైనం



**మహా:** ప్రపంచ దేశాలకెల్లా ఏ దేశానికి లేని యువ సంపద ఇండియాకు మాత్రమే ఉంది. భారత దేశంలో యువత సంఖ్య భారీగా ఉంది. ఈ విషయాన్ని పలు దేశాల ప్రతినిధులు ఎన్నో సార్లు నొక్కి చెప్పిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ అంశం ఎందుకు చర్చకు వస్తుంది అంటే... ఇండియాకు చెందిన యువత ప్రస్తుతం ఓ విషయానికి చాలా దూరంగా ఉంటున్నారంటా. పెద్దలు ఒక విషయాన్ని పదే పదే గుర్తుచేస్తుంటారు. ఏ వయసులో జరగాల్సింది అప్పుడే జరగాలి.. అప్పుడే జీవిత గమనం బాగుంటుందని హితబోధ చేస్తుంటారు. కానీ, చాలామంది యువత మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటున్నారంటా. యుక్త వయసు వచ్చి, అది దాటుతున్నా కూడా పెళ్లి వద్దంటూ మొండికేసి కూర్చుంటున్నారంటా. పెళ్లి చేసుకోవడం, పిల్లలను కనడం, సంసార జీవితంలో భాగం కావడం కన్నా అలాగే బ్యాచులర్ గా ఉండేందుకు ఇష్టపడుతున్నారంటా. వయసు దాటిపోతున్నా కూడా వివాహ బంధంలోకి అడుగు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారంటా. ఇది కేవలం ఒక తెలంగాణనో లేదా ఏపీలోనో కాదు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగుతుందంటా.

పలు సర్వేలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇందుకు కారణాలేంటని పరిశీలిస్తే.. కొంతమంది ఉద్యోగం లేదని, మరికొంతమంది ఆర్థిక సమస్యలు, కుటుంబ బాధ్యతలు ఉన్నాయని, మంచి ఉద్యోగం సంపాధించి డబ్బులు జమ చేసుకుని, పెళ్లి చేసుకుంటే ఏదైనా సమస్యలు వచ్చినా వాటిని ఈజీగా ఎదుర్కోవొచ్చనే భావనలో పలువురు, ఇంకొంతమంది వాదన మ్యారేజ్ లైఫ్ కన్నా కూడా బ్యాచిలర్ లైఫే బెటరనే భావన, ఫస్ట్ కెరీర్ ముఖ్యం ఆ తరువాతే పెళ్లి అని మరికొందరు. మాకు ఇంకా ఉద్యోగం లేదు.. మాకెవరిస్తారు పిల్లను అనే ఆలోచనలో ఇంకొందరు. ఇగ మిగతా వారు పలు రకాల కారణాలు చూపిస్తున్నారంటా. ఒకవేళ పెళ్లి చేసుకుందామనుకున్నా ఉద్యోగం లేదనో లేదా ఇంకా సెటిల్ అవ్వలేదనో లేదా ఇతర ఏ కారణాలో చెప్పో తమను పెళ్లి చేసుకునేందుకు ఇష్టపడడం లేదని ఇంకొంతమంది. ఇలా రకరకాల కారణాలను చూపి యువత మ్యారేజ్ కు ఆమడ దూరంలో ఉంటున్నారంటా. వయసు 30 ఏళ్లు దాటుతున్నా వారు పెళ్లి అనే మాట కూడా ఎత్తడంలేదంటా. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ ఎంత వేడుకున్నా కూడా వారు పెళ్లి చేసుకునేందుకు నిరాకరిస్తున్నారంటా. దీంతో వారు ఏం చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారంటా. దేశంలోని ఏ వందమంది యువతను చూసినా సగానికి పైగా ఇదే ధోరణిని అవలభింస్తున్నారంటా. దీంతో దేశంలో పెళ్లికాని వారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుందంటా. ఈ విషయాన్ని తాజా గణాంకాలు కూడా స్పష్టం చేస్తున్నాయి.

ఈ విషయమై పలువురు నిపుణులు, పెద్దలు మాట్లాడుతూ యువత ఏజ్ దాటుతున్నా కూడా పెళ్లి విషయంలో వెనుకడుగు వేయడం కొంతవరకు ఆందోళనకరమంటున్నారు. పెళ్లి అనేది ఒక మహత్తర కార్యక్రమని, పెళ్లి అనేది జీవితంలో ఒక భాగం అని, పరిస్థితుల కారణంగా పెళ్లి విషయంలో జాప్యం చేయకుండా నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు. సమస్యలకు భయపడకుండా వాటిని అధిగమిస్తూ ముందుకెళ్లాలి తప్ప, కేవలం వాటి వల్ల వాయిదా వేయడం, పెళ్లికి సుముఖత చూపొద్దని సూచిస్తున్నారు. సోలో లైఫే సో బెటర్ అనుకోకుండా వివాహ బంధంలో అడుగుపెడితే ఆ జీవిన విధానం కూడా తెలుస్తుందని చెబుతున్నారు. ఇటు ప్రభుత్వాలు కూడా యువత విషయంలో ఆలోచించాలని చెబుతున్నారు. యువత కోసం ప్రత్యేకంగా పథకాలు తీసుకురావడం లేదా ఉద్యోగ నియామకాలు చేపట్టడం వంటివి చూస్తే వారికి భరోసా వస్తుంది.. దీంతో పెళ్లి విషయంలో సుముఖత వ్యక్తం చేస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. లేకపోతే ఈ సమస్య రానున్న రోజుల్లో మరింత పెద్ద సమస్యగా మారే అవకాశాలు లేకపోలేదని చెబుతున్నారు.

రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp-
7436939999

# బాదంపప్పు, పల్లీలు.. రెండింటిలో ఏవి తినాలి..?

బాదంపప్పు, పల్లీల్లో అనేక అద్భుతమైన పోషకాలు ఉంటాయన్న సంగతి అందరికీ తెలిసిందే. ఈ రెండింటిలోనూ ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి. పైగా ఆరోగ్యకరం కూడా. కనుక చాలా మంది స్నాక్స్ రూపంలో ఈ రెండింటినీ తింటుంటారు. బాదంపప్పను నానబెట్టి తింటారు. పల్లీలను నానబెట్టి లేదా వేయించుకుని తింటారు. అధిక బరువు తగ్గాలని చూసే వారు కూడా ఆరోగ్యవంతమైన స్నాక్స్‌లాగా ఈ రెండింటిని తింటుంటారు. ఇవి ఎంతో రుచిగా కూడా ఉంటాయి. కనుక ఆరోగ్యపరంగా కూడా లాభాలు ఉంటాయి కాబట్టి చాలా మంది వీటిని స్నాక్స్ రూపంలో తింటుంటారు. అయితే బాదంపప్పు, పల్లీల్లో.. రెండింటిలో ఏవి మంచివి.. అని చాలా మందికి సందేహం వస్తుంది. దీనికి న్యూట్రిషనిస్టులు ఏమని సమాధానం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.



### ప్రోటీన్లు..

పల్లీలు, బాదంపప్పులో అనేక రకాల విటమిన్లు ఉంటాయి. ముఖ్యంగా ఈ రెండింటిలో బి విటమిన్లతోపాటు విటమిన్ ఇ కూడా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్‌లా పని చేస్తుంది. రోజుకు గుప్పెడు బాదంపప్పులను తింటే మనకు రోజుకు కావల్సిన విటమిన్ ఇలో దాదాపుగా 45 శాతం వరకు లభిస్తుంది. కనుక విటమిన్ ఇ అధికంగా కావాలంటే బాదంపప్పును తినాల్సి ఉంటుంది. ఇక ప్రోటీన్ల విషయానికి వస్తే పల్లీలు, బాదంపప్పు రెండింటిలోనూ ప్రోటీన్లు అధికంగానే ఉంటాయి. బాదంపప్పులో అమైనో ఆమ్లాలు అధికంగా ఉంటాయి. అయితే ప్రోటీన్ల విషయానికి వస్తే బాదంపప్పు కన్నా పల్లీల్లోనే ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. 100 గ్రాముల బాదంపప్పు ద్వారా 21 గ్రాముల ప్రోటీన్లు లభిస్తాయి. అదే 100 గ్రాముల పల్లీల ద్వారా 24.4 గ్రాముల ప్రోటీన్లు లభిస్తాయి. కనుక ప్రోటీన్ల కోసమే అయితే పల్లీలను తినవచ్చు.

### కొవ్వులు..

ఇక శాచురేటెడ్ కొవ్వుల విషయానికి వస్తే పల్లీల్లో ఇవి ఎక్కువగా, బాదంపప్పులో తక్కువగా ఉంటాయి. పల్లీలతో పోల్చినప్పుడు శాచురేటెడ్ కొవ్వులు బాదంపప్పులో 51 శాతం మేర తక్కువగా ఉంటాయి. అయితే ఇవి ఆరోగ్యకరమైన కొవ్వులే. కనుక బరువు తగ్గాలనుకునే వారు లేదా కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు పల్లీలకు బదులుగా బాదంపప్పును తింటే మేలు జరుగుతుందని చెప్పవచ్చు. ఇక క్యాలరీల విషయానికి వస్తే ఈ రెండింటిలోనూ ఎక్కువగానే ఉంటాయి. పల్లీల్లో 100 గ్రాములకు 567 క్యాలరీలు లభిస్తాయి. బాదంపప్పు అయితే 100 గ్రాములకు 579 క్యాలరీలు లభిస్తాయి. అంటే రెండింటితోనూ దాదాపుగా సమానంగా శక్తి లభిస్తుందన్నమాట. కనుక శక్తిని కోరుకునేవారు పల్లీలు లేదా బాదంపప్పు వేటినైనా తినవచ్చు.

# ఇచ్చినమాట నిలబెట్టుకున్నాం

- మల్లంపల్లిని మండలం చేశాం
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి సీతక్క



**ములుగు, నవంబర్ 29, మహా:** ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు జిల్లాలోని మల్లంపల్లిని మండలంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చుకుంటూ జీవో విడుదల చేశారని, అందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖా మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శుక్రవారం మల్లంపల్లి గ్రామానికి వచ్చిన మంత్రి సీతక్క అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు మంత్రి సీతక్కను పూలమాలతో సత్కరించి మండలం ఏర్పాటు చేసినందుకుగాను పాదాభివందనం చేశారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గత పాలకులు జీవోలు ఇచ్చి గాలికి వదిలేశారని, అమలుకు సాధ్యం కాకుండా ఎన్నికల స్టంట్ తో గెజిట్ నోటిఫికేషన్లు విడుదల చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కోదాన్ని చక్కదిద్దుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. మల్లంపల్లిని మండలం చేయడం సంతోషకంగా ఉందని, రాబోవు రోజుల్లో ములుగును కూడా మున్సిపాలిటీగా చేపడుతామన్నారు. కొత్త మండలాన్ని పార్టీలకతీతంగా అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. త్వరలోనే ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించి పరిపాలన అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవి చందర్, మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రజాపాలనా విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న మంత్రి మంత్రి సీతక్క




**ములుగు, నవంబర్ 29, మహా:** రాష్ట్రంలో ప్రజా ఆకాంక్షలను నెరవేర్చడం కోసమే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, రాష్ట్ర ప్రజలకు తామిచ్చిన హామీలను అమలు చేయడానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గత పాలకులు చేసిన అప్పులు ఉన్నా ప్రజల కోసం సంక్షేమ ఫలాలను కొనసాగిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి డీఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ వరకు కలెక్టర్ దివాకర టీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. అనంతరం డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అనేకమంది అమరులయ్యారని, ఉద్యమాన్ని గ్రామ గ్రామాన లేవనెత్తిన గొప్ప వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. రాష్ట్రంలో ప్రజాపాలన ఏర్పడిన అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజాక్షేత్రంలో ఉంటూ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి సమ్మక్క సారలమ్మ సన్నిధి నుంచి పాదయాత్ర ప్రారంభించిన సమయంలో జిల్లాకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారని అన్నారు. ప్రజల కోరిక మేరకు మల్లంపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేశారని, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారని అన్నారు. సీఎం చొరవతోనే కేంద్ర ప్రభుత్వం యూనిస్కో గుర్తింపు పొందిన రామప్పకు రూ.73కోట్లు కేటాయించిందని, ఆ నిధులతో రామప్పలో ఐలాండ్, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. ప్రతి నియోజకవర్గానికి 3500ల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ములుగు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. కొద్ది రోజులలోనే జిల్లా కేంద్రంలో రూ.3కోట్లతో బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ములుగును మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించడం జరిగిందని వెల్లడించారు. అంతడుపుల నాగరాజు కళాబృందం ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ .మహేందర్ జీ, సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవి చందర్, ఆర్డీవో వెంకటేష్, డీపీఆర్వో రఫిక్, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ తుల రవి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థుల సమస్యలపై నిరసన



**అశ్వారావుపేట, నవంబర్ 29, మహా:** రాష్ట్రంలోని ఎస్టీ గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకపోవడం, పలు ఘటనల్లో విద్యార్థుల ప్రాణాలు కోల్పోవడంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిరసనగా భారతీయ జనతా పార్టీ నేతలు తెలుగు సంక్షేమ భవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అశ్వారావుపేట మండల బీజేపీ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బీజేపీ నాయకులు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ, విద్యార్థుల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వ విధానాలను పునఃసమీక్షించాలని వారు డిమాండ్ చేశారు. గురుకులాల్లో భవనాల మరమ్మతులు, బోధన సిబ్బంది కొరత, సకాలంలో భోజన సదుపాయాలు లేని పరిస్థితులపై బీజేపీ నేతలు ఘాటుగా స్పందించారు. నిస్సహాయులైన విద్యార్థులను ప్రభుత్వం ఎటువంటి చర్యలతోనూ ఆదుకోకపోవడం విద్యా వ్యవస్థ పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు ఆరోపించారు. ఇటువంటి నిరసనలు అధికార పార్టీపై ఒత్తిడి తెచ్చి, విద్యార్థుల సంక్షేమం కోసం తగిన చర్యలు చేపట్టేలా చేయడం లక్ష్యంగా బీజేపీ నేతలు అన్నారు.

# బ్యాంకులు, ఏటీఎంల భద్రతపై పోలీసుల ప్రత్యేక అవగాహన



**అశ్వారావుపేట, నవంబర్ 29, మహా:** అశ్వారావుపేట పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.కరుణాకర్ ఆధ్వర్యంలో బ్యాంకులు, ఏటీఎంల భద్రతను మెరుగుపరచడంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని అన్ని బ్యాంకుల మేనేజర్లు, ఏటీఎం ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు. ఇన్స్పెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ, ఇటీవల బ్యాంకులు, ఏటీఎంలలో చోటుచేసుకుంటున్న చోరీల నేపథ్యంలో భద్రతా చర్యలపై మరింతగా దృష్టి సారించాలని సూచించారు. సీసీటీవీ కెమెరాలను సక్రమంగా నిర్వహించడం, అలారం వ్యవస్థలను చురుకుగా ఉంచడం, భద్రతా సిబ్బందిని నిర్దేశించటం వంటి చర్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని మేనేజర్లకు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో అశ్వారావుపేట ఎస్ఐ, దమ్మపేట ఎస్ఐ పాల్గొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా బ్యాంకు మేనేజర్లు తమ కార్యాలయాల్లో భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని ఈ కార్యక్రమం ద్వారా స్పష్టం చేశారు.

# కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు అవగాహన



**కొత్తగూడెం, నవంబరు 29, మహా:** శరీరంపై వచ్చే మార్పులను గుర్తించి ప్రభుత్వ సహాయంతో చికిత్సను అందించేందుకు కృషి చేయాలని డిప్యూటీ పారామెడికల్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలో రామవరం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ కుష్టు వ్యాధి గుర్తింపు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 2 నుంచి 15 వరకు 14 రోజులపాటు కుష్టువాది గ్రస్తుల గుర్తింపు కోసం ఇంటింటి సర్వే చేపట్టనున్నారని, ఎవరైనా వ్యాధికి గురై ఉంటే తగిన చికిత్సను ప్రభుత్వ సహకారంతో పూర్తి వైద్యం అందిస్తామని అన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎం నర్సులు ప్రతి ఒక్కరూ సర్వే నిర్వహించే సమయంలో వ్యాధిని ఎలా గుర్తించాలి..? శరీరం పైన ఏ విధమైనటువంటి మార్పులు జరుగుతాయో? నిర్ధారణ ఏ విధంగా జరపాలని సూచించారు. 15 రోజులపాటు ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్స్ శంకరమ్మ, సూపర్వైజర్ శ్రీనివాస్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# బుచ్చిరెడ్డిపాలెంలో ఇసుక రీచ్ ప్రారంభం



**మధిర, నవంబర్ 29, మహా:** తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామ సమీపంలోని వైరా నది వద్ద ఇసుక రీచ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఇసుక తోలకాలలో అవకతవకలు జరగటంతో వాటిని అరికట్టేందుకు అధికారులు నిలిపియడం జరిగిందని, ప్రజలు భవన నిర్మాణ కార్మికులు, నూతన గృహాలను నిర్మించుకునేవారి యొక్క ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని డిప్యూటీ సీఎం, స్థానిక శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్క ఎలాంటి అవకతవకలకు అవకాశాలు లేకుండా గ్రామ ద్వాక్రా సభ్యులను భాగస్వాములుగ చేస్తూ ఇసుకరీచులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడి రావూరి సాయినాథ్, తహశీల్దార్ రాళ్ల బండి రాంబాబు, రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ బెజ్జంకి లక్ష్మీ భార్గవి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మధిర మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిడమనూరు వంశీకృష్ణ, మండల కాంగ్రెస్ నాయకులు సంపసాల రామకృష్ణ, ఏపీఎం రాంబాబు, స్థానిక ద్వాక్రా గ్రూపు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# చెరకు సాగు రైతులకు ప్రోత్సాహకాలు అందించాలి



**నేలకొండపల్లి, నవంబర్ 29, మహా:** చెరకు సాగు రైతులకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందించాలని, టన్నుకు నాలుగు వేల రూపాయలు ధర ఇవ్వాలని శుక్రవారం తెలంగాణ చెరకు రైతు సంఘం ఆధ్వర్యంలో మధుకన్ షుగర్స్ జనరల్ మేనేజర్ కోటయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ చెరకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు రచ్చా నరసింహారావు మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వలన చెరకు పంట దిగుబడి తగ్గిపోయిందని, మరోవైపు రికవరీ కూడా తగ్గడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు అని అన్నారు. చెరకు ఫ్యాక్టరీకి చేర్చిన 14 రోజుల్లో పేమెంట్ పూర్తిగా రైతు అకౌంట్ కు జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాసిరెడ్డి ప్రసాద్, చెరకు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తోటకూర రాజు, ఇంటూరి అశోక్ రాసల కనకయ్య, యనమద్ది లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి, నవంబర్ 29, మహా:** మండల పరిధిలోని జలగం వెంగళరావు, కిష్టారం సింగరేణి ఉపరితల గనుల్లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు నష్టపరిహారాన్ని పెంచాలని నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దయానంద్ విజయకుమార్.. జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ ను తమ కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కిష్టారం, రేజర్ల గ్రామాల భూ నిర్వాసిత రైతులకు రావలసిన పెండింగ్ భూమి, మొక్కల నష్టపరిహారం త్వరితగతిన రైతులకు అందించాలని, సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన యాతాల కుంట రైతులకు రావాలసిన ఐదు కోట్ల రూపాయల నష్టపరిహారాన్ని త్వరితగతిన విడుదల చేయాలని ఎమ్మెల్యే రాగమయి జిల్లా కలెక్టర్ ను కోరారు. సత్తుపల్లి, కల్లూరు ముస్లిం సోదరుల ఖబరస్థాన్ స్థల విషయమై కలెక్టర్ తో చర్చించారు. ఈ సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

# ఎన్నికల వాగ్ధానాలు అమలు చేయాలి

- తమ్మినేని వీరభద్రం




**ఖమ్మం, నవంబర్ 29, మహా:** రాష్ట్రంలో వివిధ తరగతుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని కోరారు. ఖమ్మం నగరంలో రెండు రోజులపాటు సుందరయ్య భవనంలో జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశానికి హాజరైన తమ్మినేని మాట్లాడుతూ, పేద ప్రజలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివశిస్తున్నారని, అలాంటి వారి మీద పోలీసులు కేసులు బనాయించటం సిగ్గుచేటన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో కోటి మందికిపైగా ఉన్న కార్మికులు అనేక పరిశ్రమల్లో పనిచేస్తున్నారని, వీరికి 2012 సంవత్సరం నుండి కనీస వేతనాలు సవరించడంలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరిలో కనీస వేతనాల సవరణ కోసం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ జారీ చేశారని, ఆ ప్రకారం పెరుగుతున్న అవసరాల ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచలేదని విమర్శించారు. ఇప్పటికే 20 జిల్లాల్లో 60 కేంద్రాల్లో సుమారు లక్ష మందికిపైగా ప్రజలు ప్రభుత్వ భూముల్లో గత 3 సం.లుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, కొన్నిచోట్ల అధికారులు ఈ గుడిసెలను ధ్వంసం చేశారని, అర్హులైన పేదలందరికీ 120 గజాల ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు కట్టుకోవటానికి 5 లక్షలు ఇవ్వాలని తమ్మినేని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల వాగ్ధానాల అమలులో భాగంగా ఉపాధిహామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు వర్తింపజేయాలని, రైతు భరోసాను తక్షణమే రైతులందరికీ అమలు చేయాలని కోరారు. గ్రామ పంచాయితీ కార్మికులకు బకాయిపడిన వేతనాలు చెల్లించాలని, ఇందుకు ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించాలని కోరారు. సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో డిఎపి ధరలు విపరీతంగా పెరగటంతో అన్నదాతలపై భారాలు భారీగా పడనున్నాయని వాటిని ప్రభుత్వం వెంటనే తగ్గించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, భూక్యా వీరభద్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, చింతలచెర్వు కోటేశ్వరరావు, బొంతు రాంబాబు, వై.విక్రం లతో పాటు జిల్లా కమిటి సభ్యులు హాజరయ్యారు.

# కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ

– దీక్షా దివస్ జిల్లా ఇన్చార్జి సుధీర్ కుమార్



**ములుగు, నవంబర్ 29, మహా:** కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాలు చేస్తోందని, మాజీ సీఎం కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రం సాధ్యమయిందని హన్మకొండ మాజీ జడ్పీ చైర్మన్, దీక్షా దివస్ జిల్లా ఇన్చార్జి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ అన్నారు. శుక్రవారం ములుగులోని బండారుపల్లి రోడ్డులోగల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు అధ్యక్షతన దీక్షా దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతితో కలిసి సుధీర్ కుమార్ మాజీ సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమకారులను ఏకం చేసి కొట్లాడిన మాజీ సీఎం కేసీఆర్ పై కొందరు రాజకీయంగా అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేత కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని, ఆంధ్రపాలకుల మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. మాజీ జడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి మాట్లాడుతూ.. ఎంతోమంది విద్యార్థులు, త్యాగాలు చేసిన యువతకు మాజీ సీఎం కేసీఆర్ అండగా నిలిచారన్నారు. చిన్న నుంచి పెద్దల వరకు తెలంగాణ స్ఫూర్తిని రగిలించిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. అలాంటి గొప్ప ఉద్యమ నాయకుని సారథ్యంలో తాము పని చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఉద్యమ ఫొటోలతో గ్యాలరీ ఏర్పాటు చేయడంతోపాటు ప్రొజెక్టర్ ద్వారా అప్పటి వీడియోలను ప్రదర్శించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పోరిక గోవింద్ నాయక్, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, శ్రీనివాస్, మండల నాయకులు పాల్గొన్నారు.

# ఈల వేసి.. గోల పెట్టి

- వనసమారాధనలో స్మార్ట్ కిడ్జ్ చిన్నారుల అల్లరే అల్లరి



**ఖమ్మం సిటీ, నవంబర్ 29, మహా:** ఇద్దరు పిల్లలు ఎవరైనా ఒకచోట చేరితే వారు చేసే అల్లరి అంతా ఇంతకాదు... అలాంటిది ఓ సాముహంగా పిల్లలంతా ఒకచోటకు చేరితే వారు చేసే అల్లరి ఇక మాటల్లో చెప్పలేం. కార్తీక మాసం పురస్కరించుకుని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో చెరుకూరి వారి మామిడి తోటలో నిర్వహించిన వనసమారాధనలో పాఠశాల పిల్లలంతా ఓ చోటకు చేరి ఆటలు ఆడుతూ... పాటలు పాడుతూ ... ఈలలు వేస్తూ గోల గోల చేశారు. అల్లరి చేయడానికి కాదేది అనర్హం అన్న చందంగా వనమంతా కలియ తిరుగుతూ సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల సిబ్బంది పర్యవేక్షణలో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు రకాల ఆటల పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్న చిన్నారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. మధ్యాహ్నం సమయంలో పసందైన వంటకంబు పెట్టించి మరీ పాఠశాల యజమాన్యం పిల్లలందరినీ ఉత్సాహపరిచింది. స్మార్ట్ కిడ్జ్ పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్య తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలి

- డీఎంహెచ్వో డాక్టర్ గోపాల్ రావు



**ములుగు, నవంబర్ 29, మహా:** జిల్లాలో వైద్య ఆరోగ్య సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎన్. గోపాల్ రావు సూచించారు. శుక్రవారం ములుగులోని జిల్లా వైద్య ఆరోగ్య శాకా కార్యలయంలో పీహెచ్సీ వైద్యాధికారులు, ఆయుష్మాన్ వైద్యులు, సూపర్వైజర్లు, ఆర్బీఎస్కే వైద్యులకు సమీక్ష నిర్వహించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పనితీరును పీహెచ్సీ వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్వో గోపాల్ రావు మాట్లాడుతూ.. జిల్లాలో వైద్య సిబ్బంది పనితీరు మెరుగవ్వాలని, సమయపాలన పాటించాలని, రోగులకు ఆప్యాయతతో వైద్య సేవలు అందించాలని సూచించారు. జిల్లాలో తక్కువగా పనితీరు నమోదవుతున్న పీహెచ్సీల పై ప్రత్యేకంగా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ టీబి కంట్రోల్ ప్రోగ్రాంలో టీబి నోటిఫికేషన్ పెంచి, వ్యాధిగ్రస్తులను గుర్తించి మందులను అందించాలన్నారు. టీబి వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. అసంక్రమిక వ్యాధుల నియంత్రణ కార్యక్రమాన్ని సమీక్షిస్తూ మూడవ విడత బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను వందశాతం చేయాలని, గుర్తించిన రోగులకు ఆశాల ద్వారా మందుల పంపిణీ చేయించాలని వివరించారు. అదేవిధంగా పీహెచ్సీలలో ప్రసవాల సంఖ్యను పెంచాలని, గర్భిణీ స్త్రీలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సాధారణ ప్రసూతి అయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల నియంత్రణ కోసం టీకాను బుధ, శనివారాల్లో ఇస్తారనే విషయాన్ని లబ్ధిదారుల తల్లులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ విపిన్ కుమార్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ పవన్ కుమార్, శ్రీకాంత్, రణధీర్, భవ్యశ్రీ, ఇంచార్జ్ డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దుర్గారావు, వైద్యసిబ్బది సంపత్ రావు, సాంబయ్య, సత్యనారాయణ, సంజీవరావు, వెంకట్రెడ్డి, భూపాల్ రెడ్డి, ప్రోగ్రాం మానిటరింగ్ సూపర్వైజర్ సురేష్ బాబు, వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఎన్ఎండీపీ అమలుకు కేంద్రం ఏం చర్యలు తీసుకుంది..?

- లోక్ సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ



**ఖమ్మం, నవంబర్ 29, మహా:** నేషనల్ మెడికల్ డివైజెస్ పాలసీ అమలు కోసం దేశంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి శుక్రవారం లోక్ సభలో ప్రశ్నించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా.. సభలో ఆయన మాట్లాడుతూ.. దిగుమతులపై ఆధారపడటాన్ని 70 శాతానికి తగ్గించడానికి ఏదైనా ప్రణాళిక రూపొందించబడిందా..? అని అడిగారు. దీనికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. వైద్య పరికరాల జాతీయ విధాన అమలుకు చర్యలు తీసుకుంటున్నామని.. మంత్రిత్వ శాఖతోపాటు, ఫార్మాస్యూటికల్స్ విభాగంతో సమన్వయం చేసుకుంటున్నామని తెలిపారు. నిర్దిష్ట వ్యూహాల అమలుకు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. దిగుమతులను తగ్గించేందుకు.. దేశీయంగా వైద్య పరికరాల తయారీని కేంద్రం ప్రోత్సహిస్తోందని తెలిపారు. వైద్య పరికరాల దేశీయ తయారీ ప్రోత్సాహం ఇలా.. ప్రత్యేక లక్ష్య సాధనకు ఆర్థిక కేటాయింపుల గురించి.. ఎంపీ రఘురాం రెడ్డి ప్రశ్నించడంతో కేంద్రమంత్రి వివరాలు ఇలా తెలిపారు.

# పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ



**తాడ్వాయి, నవంబర్ 29, మహా:** మండలంలోని మేడారం ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తాడ్వాయి తహశీల్దార్ గిరిబాబు తనిఖీ చేశారు. అదేవిధంగా ఊరట్టం, మేడారం గిరిజన ఆశ్రమ పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని, కూరగాయలను, మంచినీటి వాటర్ ప్లాంట్ ను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతోపాటు భోజనం చేసి వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూలో ఉన్న విధంగా అందించకుంటే వార్డెన్లపై తగిన చర్యలు తీసుకుంటాము అని హెచ్చరించారు. పాఠశాలలో ఎటువంటి ఇబ్బందులు ఉన్న విద్యార్థులు తమకు ఫిర్యాదులు చేయమని పేర్కొన్నారు.

# మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం



**కల్లూరు నవంబర్ 29, మహా:** పట్టణ కేంద్రం గోపాలకుంటలో నివాసం ఉంటున్న మోదుగు వెంకటేశ్వర్లు(ట్రైసన్) ఇటీవల కాలంలో గుండెపోటుతో మరణించడంతో విషయం తెలుసుకున్న మిత్రుడు సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్ కార్యదర్శి ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షులు ఏనోష్ కుమార్ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడకండి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ఐదు వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ జిల్లా మీడియా సెల్ అధ్యక్షులు దాసరి డేవిడ్ రాజు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఖమ్మంపాటి మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జానపాటి రోజ్ వేణు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ తాళ్లూరి సుమన్ లు పాల్గొన్నారు.

# రైతు పండుగను విజయవంతం చేయండి

**బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి**



**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పథకాలు, ప్రజా విజయోత్సవాలలో భాగంగా రైతు పండుగను విజయవంతం చేయాలని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పిలుపునిచ్చారు .రాష్ట్రంలో ఒకపక్క ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉన్న 54,280 కోట్ల రూపాయలతో వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తు, ధాన్యం కొనుగోలుకు బోనస్, వరదల వల్ల నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి 10,000 రూపాయలు, రైతు రుణమాఫీ, నూతన మార్గదర్శకాలతో రైతు భరోసా పథకాన్ని అమలు చేయడానికి పూనుకుందని అందులో భాగంగానే నేడు పెండింగ్ లో ఉన్న మరో మూడు లక్షల మంది రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ అమలు చేస్తున్న సందర్భంలో మూడు రోజులపాటు గ్రామాలలో రైతు పండుగ నిర్వహించాలని కోరారు. త్వరలోనే క్లస్టర్ల వారిగా ఆదర్శ రైతులను ఎంపిక చేసి రైతులకు మరింత శాస్త్రీయమైన పంట ఉత్పాదకతను నేర్పుతామని, నాణ్యమైన విత్తనాలు దిగుబడులను సాధించి దేశానికే తలమానికంగా తెలంగాణ రైతు సంఘం నిలబడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, భోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ విటల్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు





# బాజీరావు బాబా బోధనలు అనుసరణీయం

**సప్తాహ వేడుకల్లో కంది మౌనా శ్రీనివాసరెడ్డి**

**ఆదిలాబాద్ మహా :** ఆధ్మాతిక గురువు బాజీరావు మార్గంలో ప్రతిఒక్కరూ నడుచుకోవాలని, ఆధ్మాత్మిక చింతనను అలవర్చుకోవాలని, భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాసరెడ్డి అన్నారు. జైనథ్ మండలంలోని బాలాపూర్ గ్రామంలో సప్తహ వేడుకలకు ఆమె హాజరయ్యారు. బాజీరావు బాబా భక్త మండలి, గ్రామస్తులు ఆమెకు సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా బాజీరావు బాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సప్తహ వేడుకల్లో భాగస్వాములయ్యారు. భజన మండలి నిర్వాహకులతో కలిసి తాళాలు వేసి అందరినీ ఉత్సాహపరిచారు. భజన కీర్తనలు, భక్తి పాటల మధ్య ఈ వేడుకలు అత్యంత వైభవంగా, శోభాయమానంగా సాగాయి. కార్యక్రమ నిర్వాహకులు కంది మౌనా శ్రీనివాసరెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,మాజీ సర్పంచ్ రౌత్ దామోదర్, మాజీ ఉప సర్పంచ్ చెన్న గజానన్,గ్రామస్తులు గాజుల కిష్టు, దీపక్ రౌత్, పురుషోత్తం రౌత్, శ్రీనివాస్, సంతోష్, భోయర్ వినోద్, రవీందర్, కిషన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



## బాధలో తోడుగా.. కంది మౌనా శ్రీనివాసరెడ్డి పరామర్శలు




**ఆదిలాబాద్ మహా :** ఆప్తులను కోల్పోయి దుఃఖంలో ఉన్నవారిని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాసరెడ్డి పరామర్శించి ఓదార్చారు. రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త షేక్ మోసిన్ ద్విచక్ర వాహనం పైనుండి కింద పడి కాలు విరగడంతో ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మౌనా శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి హాస్పిటల్ కి వెళ్లి వారిని పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీసి యోగాక్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# డేటా ఎంట్రీలో నిర్లక్ష్యం తగదు కలెక్టర్

**ఆదిలాబాద్ మహా :** కుటుంబ సర్వే డేటా నమోదులో నిర్లక్ష్యం తగదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన కుటుంబ సర్వే ద్వారా సేకరించిన డేటా ఎంట్రీలో తప్పులు లేకుండా జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని ఆయన సూచించారు తలమడుగు మండల కేంద్రం లోని ఎంపీడీవో ఆఫీస్ లో నిర్వహిస్తున్న డేటా ఎంట్రీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బందికి తగు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# అన్నదాతకు వాన భయం..!

**జిల్లాపై పొంచి ఉన్న వాన గండం**

**అప్రమత్తంగా ఉండాలన్న వ్యవసాయ శాఖ**

**బిక్కుబిక్కుమంటున్న రైతులు**



**ఖమ్మం, నవంబర్ 29, మహా:** అన్నదాతకు వాన భయం పట్టుకుంది. ఉన్నట్లుండిగా ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో రైతన్నకు ఆందోళన పెరిగిపోతుంది. ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన అన్నదాతలకు ప్రతి యేడాది మాదిరిగానే ఇప్పుడు కూడా అకాల వర్షాలు వచ్చే పరిస్థితి నెలకొన్నది. దీంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా ఉన్నది. కోతకు వచ్చిన పొలాలు కొన్ని అయితే, చేతికి వచ్చి ఆరబెట్టిన ధాన్యం రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లిన ధాన్యాన్ని సైతం జాగ్రత్త చేసేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు రావడంతో మరోవైపు వాతావరణ శాఖతోపాటు, వ్యవసాయ శాఖ అధికారుల సైతం రైతాంగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. చేతికొచ్చిన ధాన్యాన్ని, పత్తి పంటను జాగ్రత్తగా కాపాడుకోవాలని హెచ్చరిక సైతం జారీ చేస్తున్నారు. పంటలను కాపాడుకునేందుకు రైతుల వద్ద కావలసిన టార్పాలిన్ కవర్లు కూడా లేకపోవడం మరోవైపు ఆందోళన కలిగిస్తుంది. ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది పాలేరు, వైరా, లంక సాగర్ ప్రాజెక్టులతోపాటు మిగిలిన 1200 చెరువుల కింద రైతులు దాదాపు 5 లక్షల ఎకరాల్లో రకరకాల పంటలు సాగు చేశారు. ప్రధానంగా ఖమ్మం జిల్లాలో రైతాంగం వరి, మిర్చి, పత్తి పంటలు పెద్ద ఎత్తున సాగు చేశారు. రెండు లక్షల ఎకరాల్లో వరి పంట వేయగా, 50 వేల ఎకరాల్లో పత్తి, మిగిలిన విస్తీర్ణంలో మిర్చి పంటను రైతులు వేశారు. ఏడాది ఆరంభం నుంచి కూడా భారీ వర్షాలు రావడంతో పత్తి చేలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీని ఫలితంగా ఎకరానికి 12 నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని భావించినా ఇప్పటివరకు ఐదు క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. దీనికి తోడు పత్తి వ్యాపారులు సిండికేట్ గా మారి పత్తి ధరను తొక్కి పట్టడంతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. అదలా ఉండగా ప్రభుత్వం సన్నధాన్యం పండించిన రైతులకు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రకటించడం, ఆపై జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో చేతికొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్తున్నారు. సగానికి పైగా రైతులు ధాన్యాన్ని అటు కొనుగోలు కేంద్రాల వద్ద, మరోవైపు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అమ్ముకోవడం జరుగుతుంది. కొనుగోలు కేంద్రాల తీసుకువెళ్లిన ధాన్యాన్ని రకరకాల సాకులతో వ్యాపారులు పంటను కొనుగోలు చేయకపోవడంతో రైతులు ధాన్యాన్ని అక్కడే ఆరబెట్టి ఉంచారు. అంతేకాకుండా రైతులు ఎకరం ఒక్క ఇంటికి మిషన్లకు రూ. 3000 నుంచి 4000 రూపాయల వరకు ఖర్చు చేస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి నూర్పిడి చేసిన పంటను ఆయా ప్రాంతాల్లో ఉన్న రహదారులపై ఆరబెట్టి ఉంచారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇదే క్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు వేసి జాగ్రత్తపరచుకోవాలని అవగాహన సైతం కల్పిస్తున్నారు. జిల్లాలో ఏ క్షణమైనా అకాల వర్షాలు కురిసే పరిస్థితి నెలకొని ఉండడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించాలి

**మధ్యాహ్న భోజన కార్మికులు.. ఎంఈఓకు వినతి పత్రం**



**ఖమ్మం రూరల్, నవంబర్ 29, మహా:** మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, పది నెలల కోడిగుడ్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం రూరల్ మండలం, జలగం నగర్ మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల నాయకులు రాధమ్మ, సైదమ్మ, శ్రీలక్ష్మి, రూప, సుజాత, కవిత, వరలక్ష్మి, సుశీల, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్...



అది తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అని నినాదమిచ్చిన కేసీఆర్..రాష్ట్ర సాధన కోసం మృత్యువును ముద్దుపెట్టుకొనేందుకు తెగించిన రోజు! అది.. దశాబ్దాలుగా గోసపడుతున్న తెలంగాణ ప్రాంతం సాగిస్తున్న ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఒక అపూర్వ ఘట్టం! నవంబర్ 29! తెలంగాణ మర్చిపోలేని రోజు! ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ తెలంగాణ కోసం ఆమరణ దీక్షకు దిగిన ఉద్విగ్న సందర్భం! మహాత్ముడి అహింసా మార్గంలో ఉద్యమాన్ని నడిపిన కేసీఆర్.. తన దీక్షతో నాటి యూపీఏ ప్రభుత్వంతో 'డిసెంబర్ 9 ప్రకటన' చేయించగలిగారు! తన ప్రాణాన్ని పణంగా పెట్టి.. పోరుత్తేజాలకు కొత్త ఊపిరులూదారు. అందుకే.. 'కేసీఆర్ దీక్షకు ముందు.. దీక్ష తర్వాత'అన్నట్టు ఉద్యమాధ్యాయంలో పూర్వోత్తరాలను వేరుచేసి చర్చించేలా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న శ్రీమతి తుల ఉమ , మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు & చెన్నూర్ మాజీ శాసనసభ్యులు బాల్క సుమన్ , మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు , బెల్లంపల్లి మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య , మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి మూడు నియోజకవర్గాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి నిధులు

**కృతజ్ఞతలు తెలిపిన గొల్లమందల శ్రీనివాసరావు**



**మధిర, నవంబర్ 29, మహా:** మండల పరిధిలో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయబడిన రొంపిమళ్ళ గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ గతంలో మల్లారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న తమ గ్రామం ఇటీవల నూతన పంచాయతీల ఏర్పాటు కార్యక్రమంలో ప్రత్యేక పంచాయతీగా రూపుదిద్దుకొందని, ఆ తర్వాత జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సర్పంచిగా గెలిచారని తెలిపారు. ఆనాటి నుండి గ్రామపంచాయతీ కార్యాలయం లేకపోవడంతో గ్రామంలో పరిపాలన విధానానికి కొన్ని ఇబ్బందులు తలెత్తడంతో సమస్యను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించి వెంటనే నూతన గ్రామపంచాయతీ కార్యాలయం నిర్మాణానికి 20 లక్షల రూపాయలను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. గతంలోనూ మల్లు భట్టి విక్రమార్క గ్రామ అభివృద్ధి కోసం, దళితులకు దళిత బంధు అందించడంలో కీలక పాత్ర పోషించారని, ఇటీవల ఉద్యోగ ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు గ్రామ పరిసరాల్లోనే ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేసి పనులను వేగవంతంగా నడిపిస్తున్నారని ఆయన కొనియాడారు. తమ గ్రామంపై మల్లు భట్టి విక్రమార్క మొదటి నుండి ప్రత్యేక చొరవ తీసుకొని అభివృద్ధి చేస్తున్నారని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లోనూ గ్రామ ప్రజలంతా ఆయన వెంట ఉండి గ్రామాభివృద్ధిలో ఐకమత్యంతో ముందుకువెళతామని వారు తెలిపారు.

# ఉపవాసం ఉన్నవాళ్ళ పేరు మీద దీక్షా దివస్‌లా..

**ఆత్మ బలిదానాలు చేసుకున్న అమరవీరుల పేరు మీద ఏం చేశారు**

**తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షులు దాసర్ల శ్రీశైలం ధ్వజం**



**ఆదిలాబాద్ మహా :** ఉద్యమ పార్టీ గా ఆ ముసుగులో ఓట్లు వేయించుకొని అధికారం లోకి వచ్చిన బిఆర్ఎస్ అసలైన ఉద్యమ కారుల త్యాగాలను మాత్రం విస్మరించిందని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షులు దాసర్ల శ్రీశైలం మండి పడ్డారు. జిల్లాలోని బోథ్ నియోజకవర్గ కేంద్రం లో జిల్లా అధ్యక్షులు సామల ప్రశాంత్ తె కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక నియంత లాగా ఉద్యమకారులను పట్టించుకోకుండా,ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ అడ్డొచ్చిన వారిని అణగదొక్కుతూ పాలన కొనసాగించారని ఆరోపించారు.. బిఆర్ఎస్ ను ప్రజలు పక్కన పెడితే మళ్ళీ ఈ రోజు దీక్ష దివస్ పేరు మీద దొంగ నాటకాలు ఆడుతున్నారని ఉపవాసం ఉన్నవాళ్ళ పేరు మీదనే దీక్ష దివస్ లు జరుపుకుంటే ఆత్మ బలిదానాలు చేసుకున్న అమరవీరుల పేరు మీద ఏ ఒక్క రోజు కూడా ఏదైనా కార్యక్రమం జరుపుకున్నారా అంటూ ప్రశ్నించారు. ఏ నాడు ఉద్యమకారులను గుర్తించని బిఆర్ఎస్ నేడు ఉద్యమకారుల పట్ల ప్రేమ ఉన్నట్టు వ్యవహరించడం సిగ్గు చేటని మళ్ళీ మోస పోవడానికి తెలంగాణ సమాజం సిద్ధంగా లేదని అన్నారు. ఉద్యమంలో భాగంగా చాలా మంది కుటుంబం లో పెద్ద దిక్కును కోల్పోయి ఆసరా కోసం ఎదురుచూస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం వారందరికీ అండగా ఉండాలని కోరారు.

# టీచర్‌గా మారిన కలెక్టర్

**బరంపూర్ స్కూల్లో గణితం బోధించిన రాజర్షిషా**



**ఆదిలాబాద్ మహా :** అధికారిక, పాలనపరమైన కార్యక్రమాలలో నిత్యం బిజిగా గడిపే జిల్లా కలెక్టర్ మాస్టర్‌గా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. బోర్డుపై లెక్కలు చెబుతూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. తలమడుగు మండలంలోని బరంపూర్ గ్రామ జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మ్యాథ్స్ చెప్పి ఉత్సాహపరిచారు. స్వయంగా ఆయన శ్రీకారం చుట్టిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బరంపూర్ గ్రామాన్ని సందర్శించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయనే ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు లెక్కలు బోధించారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. తాము నిర్దేశించుకున్న లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు. పదిలో వందకు వందశాతం ఫలితాలు సాధించాలన్నారు. అందుకు విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఏదైనా సబ్జెక్టుల్లో వెనుకబడితే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. రేపటి భావిభారత పౌరులని, మంచి మార్గం లో నడిచి ఆదర్శప్రాయంగా నిలవాలని ఆకాంక్షించారు.

# నిర్మల్‌లో ఏసీబీ దాడులు



**నిర్మల్ మహా :** జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సర్వే ల్యాండ్ రికార్డ్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం దాడులు చేపట్టారు. కార్యాలయంలో పనిచేస్తున్న గాంధారి జగదీష్ అనే జూనియర్ అసిస్టెంట్ నిర్మల్ జిల్లా కేంద్రంలోని బుధవార్ పేట్ కాలనీకి చెందిన సల్ల హరీష్ కుమార్ అనే వ్యక్తి నుండి తన పట్టా భూమి సేతువార్ కోసం ఇరవై వేలు డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం మధ్యాహ్నం జగదీష్ ఆదేశాల మేరకు కార్యాలయంలో అటెండర్ గా పనిచేస్తున్న ప్రశాంత్ రూ. 10 వేల రూపాయలు తీసుకుంటూ అవినీతి నిరోధ శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. డబ్బులు స్వాధీనం చేసుకున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి వారిని కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

## 200 కోట్లతో.. బన్యన్ నేషన్ విస్తరణ

**హైదరాబాద్, నవంబర్ 28:** ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ పరిశ్రమను నిర్వహిస్తున్న అంకుర సంస్థ 'బన్యన్ నేషన్' రూ.200 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గురువారం సంస్థ ప్రతినిధులు సచివాలయంలో మంత్రిని కలుసుకొని భవిష్యత్తు పెట్టుబడి ప్రణాళికను వివరించారు. ప్రస్తుతం హైదరాబాద్‌కు సమీపంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో 15 వేల టన్నుల వార్షిక సామర్థ్యంతో 'బన్యన్ నేషన్' రీసైక్లింగ్ పరిశ్రమను నిర్వహిస్తున్నది. ఈ ప్లాంట్ సామర్థ్యాన్ని 45 వేల టన్నులకు విస్తరించడానికి నూతన ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిందన్నారు. ఈ విస్తరణ పూర్తయితే మరో 500 మందికి కొత్తగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని మంత్రి వెల్లడించారు. రీసైక్లింగ్ చేసిన ప్లాస్టిక్‌ను ఈ సంస్థ యూనీలివర్, టాటా మోటార్స్ లాంటి పెద్ద కంపెనీలకు విక్రయిస్తుందని మంత్రి తెలిపారు. రూ.100 కోట్ల వార్షిక టర్నోవర్ కలిగిన బన్యన్ నేషన్ లాభాల్లో నడుస్తున్నదని, కొత్త ప్లాంట్ ఏర్పాటు కోసం వారు మరికొంత భూమిని అడుగుతున్నారని, దీనిపై టీజీఐఐసీ నిర్ణయం తీసుకుంటుందని మంత్రి వివరించారు.




### రిలయన్స్ డిజిటల్‌లో బ్లాక్ ఫ్రైడే సేల్స్

**ముంబై, నవంబర్ 28:** పండుగ సీజన్ పూర్తికావడంతో కస్టమర్లను ఆకట్టుకోవడానికి రిలయన్స్ డిజిటల్ సరికొత్తగా బ్లాక్ ఫ్రైడే విక్రయాలు ఆరంభించింది. ఈ ఆఫర్లలో భాగంగా ఎంపిక చేసిన డెబిట్, క్రెడిట్ కార్డులు(ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, వన్‌కార్డ్) కొనుగోళ్లపై రూ.10 వేల వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్‌తో పాటు కన్జ్యూమర్ డ్యూరబుల్‌పై రూ. 22,500 వరకు క్యాష్‌బ్యాక్ ఇస్తున్నది. ఈ ప్రత్యేక ఆఫర్ డిసెంబర్ 2 వరకు అందుబాటులో ఉండనున్నది.

## ఆడీ క్యూ7 ఎస్‌యూవీ

### ప్రారంభ ధర రూ.88.66 లక్షలు



**న్యూఢిల్లీ, నవంబర్ 28:** జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ ఇండియా.. దేశీయ మార్కెట్లోకి తన ఫ్లాగ్‌షిప్ ఎస్‌యూవీ క్యూ7 సరికొత్త వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు రూ.88.66 లక్షలు మొదలుకొని రూ.97.81 లక్షల గరిష్ఠ స్థాయిలో లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. 3.0 లీటర్ల వీ6 టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో తయారైన ఈ మాడల్‌లో 8స్పీడ్ గేర్‌బాక్స్, కేవలం 5.6 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 250 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఈ సందర్భంగా ఆడీ ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ మాట్లాడుతూ..వచ్చే ఏడాది లగ్జరీ కార్ల ఇండస్ట్రీ 810 శాతం వృద్ధిని నమోదు చేసుకోనుండగా, సంస్థ కూడా ఇంతే స్థాయిలో వృద్ధిని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జనవరిసెప్టెంబర్ మధ్యకాలంలో ఇండస్ట్రీ 5 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, ఈ ఏడాది 50 వేల యూనిట్లకు చేరుకుంటున్నదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు.

## హెచ్‌పీ బ్లాక్ ఫ్రైడే ఆఫర్లు..

### రూ.8,000 వరకూ క్యాష్ బ్యాక్

గ్లోబల్ టెక్ దిగ్గజం హెచ్‌పీ (HP) తన లాప్‌టాప్‌లు, డెస్క్ టాప్ కంప్యూటర్లపై ఆకర్షణీయ క్యాష్ బ్యాక్ ఆఫర్లు ప్రకటించింది. తన బ్లాక్ డే ఆఫర్ల కింద సెలెక్టెడ్ లాప్ టాప్ లు, డెస్క్ టాప్ కంప్యూటర్లపై ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. ఓపెన్, విక్టస్, స్పెక్ట్రే, పెవిలియన్, ఎన్వే సిరీస్ లాప్ టాప్ లు, డెస్క్ టాప్ కంప్యూటర్లపై ఆకర్షణీయ ఆఫర్లు ప్రకటించింది. ఇది పరిమిత ఆఫర్ అని, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ కార్డు యూజర్లకు ఆఫర్ వర్తిస్తుందని తెలిపింది. ఈ నెల 27 నుంచి డిసెంబర్ రెండో తేదీ వరకూ భారత్ కస్టమర్లకు బ్లాక్ ఫ్రైడే ఆఫర్లు లభిస్తాయని తెలిపారు. రూ.79,999, అంతకంటే ఎక్కువ లావాదేవీలు జరిపితే రూ.5,000 ఇన్ స్టంట్ క్యాష్ బ్యాక్ ఉంటుంది. లావాదేవీల విలువ రూ.99,999, అంతకంటే ఎక్కువగా ఉంటే రూ.8000 క్యాష్ బ్యాక్ లభిస్తుంది. హెచ్‌పీ విక్టస్, హెచ్‌పీ ఓమెన్ 16, హెచ్‌పీ ఓమెన్ 17, హెచ్‌పీ ఒమెన్ ట్రాన్స్ కెండ్ 14, హెచ్‌పీ ఓమెన్ 35ఎల్ గేమింగ్ డెస్క్ టాప్ కంప్యూటర్ పై ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. హెచ్‌పీ ఓమెన్ ట్రాన్స్ కెండ్ 14 విత్ షాడో బ్లాక్ ఆప్షన్ రూ.1,74,999 నుంచి ప్రారంభం అవుతుంది. హెచ్‌పీ నుంచి వచ్చే ఇతర పర్సనల్ కంప్యూటర్లు – హెచ్‌పీ ఓమినీ బుక్ ఆల్ట్రా ఫ్లిప్, హెచ్‌పీ ఓమినీ బుక్ ఎక్స్, హెచ్‌పీ పెవిలియన్ ప్లస్ 14, హెచ్‌పీ ఎన్వీ ఎక్స్360, హెచ్‌పీ స్పెక్ట్రే ఎక్స్360, హెచ్‌పీ ఎలైట్ బుక్ ఆల్ట్రా జీ1క్యూ, హెచ్‌పీ డ్రాగన్ ఫ్లై జీ4 లపై డీల్స్ ఉన్నాయి. ఇక హెచ్‌పీ ఓమినీ బుక్ ఆల్ట్రా ఫ్లిప్ 14 ఆల్ట్రా 7 పీసీ ధర రూ.1.81,999, హెచ్‌పీ ఓమినీ బుక్ ఎక్స్ ధర రూ.1,39,999 నుంచి ప్రారంభం అవుతుంది.

## 3,300 కోట్ల సెటిల్‌మెంట్

### తెలుగు రాష్ట్రాల క్లెయింలపై స్టార్‌హెల్త్ ప్రకటన

**హైదరాబాద్, నవంబర్ 28:** గడిచిన ఐదేండ్లలో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో రూ.3,330 కోట్ల విలువైన క్లెయింలను సెటిల్‌మెంట్ చేసినట్లు స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సనత్ కుమార్ తెలిపారు. అదే దేశవ్యాప్తంగా నిమిషానికి నాలుగు చొప్పున 1.1 కోట్ల క్లెయింలను సెటిల్ చేసినట్లు, వీటి విలువ రూ.52 వేల కోట్లని ఆయన చెప్పారు. మరోవైపు, ఆరోగ్య పాలసీలపై విధిస్తున్న జీఎస్టీని ఎత్తివేయాలని దీంతో సామాన్యులకు తక్కువకే పాలసీలు లభిస్తాయన్నారు. మరోవైపు, ఇంటివద్దనే హెల్త్‌కేర్ సేవలనూ ప్రారంభించామని, తెలంగాణలో హైదరాబాద్, సికింద్రాబాద్, ఏపీలో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, కాకినాడ, తిరుపతి, నెల్లూరులలో అందుబాటులో ఉంటాయన్నారు.

### రిలయన్స్.. ఎయిర్‌టెల్ దన్నుతో లాభాలతో ముగిసిన ఈక్విటీ మార్కెట్లు..!



దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం పాజిటివ్ నోట్‌తో ముగిశాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 703.38 పాయింట్లు లాభంతో 79,747.12 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో 79,923.90 పాయింట్ల నుంచి 79,026.18 పాయింట్ల మధ్య తచ్చాడింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 216.95 పాయింట్లు పుంజుకుని 24,131.10 పాయింట్ల వద్ద ముగింది. ఎన్ఎస్ఈ50లో 43 స్టాక్స్ లాభాలతో స్థిర పడ్డాయి. భారతీ ఎయిర్ టెల్, సిప్లా, సన్ ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా కన్జూమర్ స్టాక్స్ 4.40 శాతం వరకూ లాభ పడ్డాయి. మరోవైపు పవర్ గ్రిడ్ కార్పొరేషన్, శ్రీరాం ఫైనాన్స్, హీరో మోటో కార్ప్, హెచ్డీఎఫ్సీ లైఫ్, నెస్లే ఇండియా 1.35 శాతం వరకూ నష్టపోయాయి. ఇదిలా ఉంటే రిలయన్స్ షేర్ 1.63 శాతం లాభంతో ముగిసింది.నిఫ్టీ మిడ్ క్యాప్ 0.16 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ 0.75 శాతం వృద్ధి చెందాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంకు, నిఫ్టీ రియాల్టీ మినహా అన్ని ఇండెక్సులు లాభ పడ్డాయి. నిఫ్టీ ఫార్మా 2.35 శాతం, నిఫ్టీ హెల్త్ కేర్ 2.04శాతం లాభాలతో ముగిశాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్30లో భారతీ ఎయిర్ టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రా టెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్ లాభ పడితే, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, నెస్లే ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్ఫోసిస్ నష్టాలతో స్థిర పడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ ధర 72.67 డాలర్లు, ఔన్స్ బంగారం 2662 డాలర్ల వద్ద ట్రేడవుతున్నాయి.



# దేశం-విదేశం NATIONAL NEWS



## ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా..


### 10 లక్షల ఇండ్లకు నిలిచిన విద్యుత్

### దాదాపు 200 క్షిపణులు, డ్రోన్లతో భీకర దాడి



**కీవ్:** ఉక్రెయిన్ విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా వ్యవస్థపై రష్యా గురువారం విరుచుకుపడింది. దాదాపు 200 క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. రెండు వారాల్లో ఇది రెండో భారీ దాడి. చలికాలం రావడానికి ముందే తమ విద్యుదుత్పత్తి వ్యవస్థను దెబ్బ తీయడానికి రష్యా ప్రయత్నిస్తున్నదనే ఆందోళన ఉక్రెయిన్‌లో వ్యక్తమవుతున్నది. ఉక్రెయిన్‌లోని అన్ని ప్రాంతాల్లోని విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టులపై రష్యా దాడులు చేస్తున్నదని ఉక్రెయిన్ విద్యుత్తు శాఖ మంత్రి హెర్మన్ హలూషెంకో ఫేస్‌బుక్ పోస్ట్‌లో తెలిపారు. దేశవ్యాప్తంగా అత్యవసర విద్యుత్తు కోతలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సామాన్య ప్రజలు నివసించే ప్రాంతాలపైనా రష్యా దాడులు చేస్తున్నదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఒకేసారి పెద్ద మొత్తంలో చిన్న చిన్న బాంబులను కురిపిస్తుండటంతో సాధారణ పౌరులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రజలు తమ ఫోన్లు, ఇతర పరికరాలను ఛార్జింగ్ చేసుకోవడానికి ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులను ఉక్రెయిన్ ఆదేశించింది. ప్రజల కోసం ప్రత్యేకంగా షెల్టర్లను ఏర్పాటు చేయాలని చెప్పింది.

## 16 ఏండ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం



### చట్టం చేసిన ఆస్ట్రేలియా

కాన్‌బెర్రా: తమ దేశంలో 16 ఏండ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించకుండా ఆస్ట్రేలియా చట్టం చేసింది. ఈ చట్టాన్ని సెనేట్‌లో 19 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించగా 34 మంది ఆమోదించారు. ప్రతినిధుల సభలో 13 మంది మాత్రమే బిల్లును వ్యతిరేకించగా ఏకంగా 102 మంది ఆమోదం తెలిపారు. దీంతో పిల్లలకు సోషల్ మీడియాను నిషేధిస్తూ చట్టం చేసిన మొదటి దేశంగా ఆస్ట్రేలియా నిలిచింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో 16 ఏండ్ల లోపు పిల్లలకు అకౌంట్లు ఉండకుండా చూడటంలో విఫలమైతే ఆయా సోషల్ మీడియా సంస్థలకు 33 మిలియన్ అమెరికన్ డాలర్ల వరకు జరిమానా విధించేలా చట్టంలో పొందుపరిచారు.



## కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన..

### హెజ్బొల్లా స్థావరంపై ఇజ్రాయెల్ వైమానిక దాడి!

### దక్షిణ లెబనాన్‌లోకి అనుమానితులు వస్తున్నారని ఐడీఎఫ్ ఆరోపణ

**జెరూసలేం, మహా:** హెజ్బొల్లాతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, సరిహద్దులో సామాన్యులు తిరిగి స్వస్థలాలకు చేరుకోవటాన్ని ఇజ్రాయెల్ బలగాలు అడ్డుకుంటున్నాయి. పెద్ద సంఖ్యలో అనుమానిత వ్యక్తులు దక్షిణ లెబనాన్ ప్రాంతంలోకి వస్తున్నారని, ఇది కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన కిందకే వస్తుందని ఐడీఎఫ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీని కంటే కొద్ది గంటల ముందు 'హెజ్బొల్లా' నుంచి కూడా ముఖ్యమైన ప్రకటన ఒకటి విడుదలైంది. ఇజ్రాయెల్ బలగాలను అంతమొందించటం కోసం తమ ఫైటర్స్ కాచుకొని ఉన్నారని తెలిపింది.గురువారం దక్షిణ లెబనాన్‌లోని ఆరు ప్రాంతాలపై ఇజ్రాయెల్ సైనిక ట్యాంక్‌లు దాడులు నిర్వహించాయి. అలాగే అదే ప్రాంతంలో మధ్యశ్రేణి రాకెట్లను నిల్వ చేయడానికి హెజ్బొల్లా వినియోగించే స్థావరంలో ఉగ్రవాద కార్యక్రమాలు గుర్తించామని, వాటిని తమ వైమానిక దళం అడ్డుకుందని ఇజ్రాయెల్ మిలటరీ తెలిపింది. తమ ఆర్మీ బలగాలు ఇంకా దక్షిణ లెబనాన్‌లోనే ఉన్నాయని, కాల్పుల విరమణ ఒప్పంద షరతులను అతిక్రమించకుండా అవి చూస్తాయని పేర్కొంది. ఫ్రాన్స్, అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, హెజ్బొల్లా నాయకులకు మధ్య కుదిరిన కాల్పుల విరమణ బుధవారం తెల్లవారుజాము నుంచి అమల్లోకి వచ్చింది. ఫలితంగా లెబనాన్, ఇజ్రాయెల్ సరిహద్దులో శరణార్థులుగా మారిన ప్రజలంతా తిరిగి తమ సొంత ప్రాంతాలకు వస్తున్నారు. యుద్ధం కారణంగా దక్షిణ లెబనాన్‌ను వీడి వెళ్లిపోయిన వేలాదిమంది తిరిగి తమ ఇండ్లను వెతుక్కుంటూ వస్తున్నారు. అయితే సరిహద్దులో ఐడీఎఫ్ బలగాలు వారిని అడ్డుకుంటున్నాయి. దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ నిఘా డ్రోన్లు ఎగురుతున్నాయని 'రాయిటర్స్' కథనం పేర్కొన్నది.

## ఇస్కాన్‌పై నిషేధానికి బంగ్లా హైకోర్టు నిరాకరణ..



**ఢాకా, నవంబర్ 28:** ఇస్కాన్ సంస్థ కార్యకలాపాలను నిషేధించేందుకు బంగ్లాదేశ్ హైకోర్టు నిరాకరించింది. ఇస్కాన్ మాజీ సభ్యులు చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టు నేపథ్యంలో ఇస్కాన్‌పై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను గురువారం విచారించిన హైకోర్టు.. ఇస్కాన్‌పై నిషేధం విధించేందుకు నిరాకరించింది. కాగా, చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టును బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఖండించారు. ఆయనను అన్యాయంగా అరెస్టు చేశారని, వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

### ఐసీసీలో హసీనాపై విచారణ జరపాలి

బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు(ఐసీసీ)లో విచారణ జరపాలని తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ కోరారు. గురువారం ఆయనతో ఢాకాలో ఐసీసీ ప్రాసిక్యూటర్ కరీం ఏ ఖాన్ భేటీ అయ్యారు. హసీనాపై బంగ్లాదేశ్‌లో జరుగుతున్న విచారణతో పాటు ఐసీసీలోనూ విచారణ జరపాలని ఆయనను యూనస్ కోరారు.

## 17 ఏళ్ల క్రితం నాటి ఘటనకు క్షమాపణలు చెప్పిన రష్యా అధ్యక్షుడు

**మాస్కో:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.. జర్మనీ మాజీ ఛాన్సలర్ ఏంజిలా మెర్కల్‌కు క్షమాపణలు చెప్పారు. 17 ఏళ్ల క్రితం జరిగిన ఆ ఘటనపై ఆయన పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. 2007లో సోచి నగరంలో జరిగిన ఓ మీటింగ్‌కు మెర్కల్ హాజరయ్యారు. అయితే ఆ మీటింగ్‌కు పుతిన్ పెంపుడు శునకం లాబ్రడార్ కోని కూడా వచ్చింది. మెర్కల్ కూర్చున్న కుర్చీ చుట్టూ ఆ శునకం పహారా కాసింది. ఆ సమయంలో మెర్కల్ కాస్త ఆందోళనకు గురయ్యారు. కుక్కలకు భయపడే మెర్కల్ ఆ ఘటన పట్ల సీరియస్ అయ్యారు. ఇటీవల ఫ్రీడమ్ అనే టైటిల్‌తో మెర్కల్ ఓ పుస్తకాన్ని రాశారు. దాంట్లో ఆ ఘటన గురించి ఆమె ప్రస్తావించారు. పుతిన్ పెంపుడు కుక్క వల్ల తాను చాలా ఇబ్బందిపడినట్లు పేర్కొన్నారు. తనను బెదిరించేందుకు పుతిన్ ఆ పని చేశారని మెర్కల్ తన బుక్‌లో తెలిపారు. ఆ ఘటన పట్ల గురువారం పుతిన్ మరోసారి క్షమాపణలు చెప్పారు.

నిజానికి మెర్కల్‌కు కుక్కలు అంటే భయం. 1995లో ఆమెను ఓ శునకం కరిచింది. అప్పటి నుంచి ఆమె కుక్కలకు భయపడుతోంది. కానీ పుతిన్‌ను కలిసిన సమయంలో.. ఆ మీటింగ్‌కు పెంపుడు కుక్క రావడంతో ఆమెకు భయమేసింది. తాను భయపడుతుంటే ఆ ఘటన చూసి పుతిన్ ఎంజాయ్ చేసినట్లు ఆమె ఆరోపించారు. ఆ ఘటన పట్ల గతంలోనే క్షమాపణలు చెప్పినట్లు కజకిస్తాన్‌లో జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పుతిన్ తెలిపారు. మెర్కల్‌కు కుక్కలంటే భయమన్న విషయం తెలియదని, లేదంటే ఆ రోజు అలా జరిగేది కాదు అని పేర్కొన్నారు.

### డోనాల్డ్ ట్రంప్ సేఫ్‌గా లేరు

#### రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆందోళన

డోనాల్డ్ ట్రంప్ సేఫ్‌గా లేరని రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. కజకస్తాన్‌లో జరిగిన ఓ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు ముందు ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ క్షేమంగా లేరన్నారు. ట్రంప్‌కు వ్యతిరేకంగా ఆ ఎన్నికల్లో అనాగరిక పద్ధతిలో పోరు జరిగిందన్నారు.



# హైదరాబాద్‌లో ఖేలో ఇండియా గేమ్స్


## 2026లో నిర్వహణకు కేంద్రం సుముఖం

**హైదరాబాద్:** ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా 2026 పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు కేంద్ర క్రీడాశాఖ సుముఖత వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన పలు ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్నది. ఇప్పటికే ఖేలో ఇండియా 2025కు బీహార్ ఆతిథ్యం ఖరారు కాగా, 2026లో తెలంగాణకు అవకాశమిచ్చేందుకు క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయా సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా స్టేడియాల్లో సౌకర్యాలు ఉన్నాయని ప్రభుత్వం తమ ప్రతిపాదనల్లో తెలిపింది.

# శుభమన్ గిల్ బ్యాటింగ్ ప్రాక్టీస్.. రెండో టెస్టుకు రెడీ!

కాన్‌బెరా: ఇండియన్ ఓపెనింగ్ బ్యాటర్ శుభమన్ గిల్.. మళ్లీ బ్యాట్ పట్టాడు. కాన్‌బెరాలో ఇవాళ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. ఇటీవల అతనికి బొటన వేలుకు గాయం అయ్యింది. ఆ గాయం నుంచి అతను కోలుకున్నాడు. గాయం వల్ల పెర్త్‌లో జరిగిన తొలి టెస్టుకు అతను దూరం అయ్యాడు. అయితే ఇవాళ ప్రాక్టీస్‌లో పాల్గొనడం వల్ల.. అతను రెండో టెస్టులో ఆడే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. తొలి టెస్టులో 295 రన్స్ తేడాతో భారత్ నెగ్గడం వల్ల.. గిల్ అవసరం పెద్దగా తెలియలేదు. ప్రాక్టీస్ సెషన్‌లో యశ్ దయాల్, ఆకాశ్ దీప్ బౌలింగ్‌లో గిల్ ప్రాక్టీస్ చేశాడు. శనివారం నుంచి కాన్‌బెరాలో ఆస్ట్రేలియా ప్రైమ్‌మినిస్టర్స్ లెవన్ జట్టుతో భారత్ తలపడనున్నది. గిల్ గైర్హాజరీలో దేవదత్ పడిక్కల్.. అతని స్థానంలో ఫస్ట్ టెస్టులో ఆడాడు. కానీ పడిక్కల్ భారీ స్కోరు చేయడంలో విఫలం అయ్యాడు. ఒకవేళ రెండో టెస్టుకు గిల్ సిద్ధమైతే, అప్పుడు బ్యాటింగ్ పొజిషన్స్‌లో మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఫస్ట్ టెస్టులో ఓపెనర్‌గా రాహుల్ కొంత వరకు రాణించాడు. కానీ పెర్త్ టెస్టుకు కెప్టెన్ రోహిత్ శర్మ గైర్హాజరు కావడంతో.. ఇప్పుడు రెండో టెస్టులో ఆ ప్లేస్ కీలకం కానున్నది. జైస్వాల్‌తో రోహిత్ ఓపెనింగ్ చేసే ఛాన్సు ఉన్నది. ఇక వన్‌డౌన్‌లో రాహుల్ వస్తాడనుకుంటున్నారు. అదే జరిగితే గిల్ అయిదో స్థానంలో బ్యాటింగ్ చేయాల్సి వస్తుంది. పీఎం లెవన్‌తో జరిగే ప్రాక్టీస్ మ్యాచ్‌లో.. ఒవకేళ భారత జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో ఏదైనా మార్పులు చేస్తుందో లేదో వేచి చూడాల్సిందే.




# హైబ్రిడ్‌కు నో

## మొండిపట్టు వీడని పాకిస్థాన్

### భారత్ రాకుంటే టోర్నీలన్నీ బహిష్కరిస్తామని హెచ్చరిక


### నేడు తేలనున్న చాంపియన్స్ ట్రోఫీ భవితవ్యం

**కరాచీ:** పాకిస్థాన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఆ దేశంలో జరుగుతుందా? ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో సర్వత్రా ఇదే చర్చ నడుస్తోంది. భద్రతా కారణాల రీత్యా దాయాది దేశానికి వెళ్లబోమని, హైబ్రిడ్ మోడల్ అయితేనే ఆడతామని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఇది వరకే తన నిర్ణయాన్ని స్పష్టం చేయగా మరోవైపు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అందుకు ససేమిరా అంగీకరించడం లేదు. టీమ్ఇండియా పాక్‌కు రావాల్సిందేనని పట్టుబడుతోంది. శుక్రవారం జరగాల్సి ఉన్న ఐసీసీ వర్చువల్ సమావేశానికి కొద్దిగంటల ముందు కూడా పీసీబీ అదే మొండి పట్టుదలను ప్రదర్శిస్తూ.. 'హైబ్రిడ్ మోడల్‌ను అంగీకరించే ప్రసక్తే లేదు. దీనిపై మేం ఇది వరకే ఐసీసీకి మా నిర్ణయాన్ని తేల్చి చెప్పాం' అని బోర్డు ప్రతినిధి ఒకరు చెప్పారు. ఈ నేపథ్యంలో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ విడుదలపై జరగాల్సిన చర్చ కాస్తా అసలు ఈ టోర్నీ పాకిస్థాన్‌లో ఉంటుందా? మరో దేశానికి తరలిపోతుందా? అలా చేస్తే పాకిస్థాన్ ఊరుకుంటుందా? భారత్ కోరుకున్నట్టుగా హైబ్రిడ్ మోడల్ సాధ్యమవుతుందా? అన్న అంశాలపై సాగనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.


**టోర్నీని తరలిస్తారా?**

పాక్‌కు రాబోమని విముఖత వ్యక్తం చేసినా టీమ్ఇండియా తమ దేశానికి రావాల్సిందేనన్న మంకు పట్టుతో ఉన్న పీసీబీకి గత వారం రోజులుగా పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో తలెత్తిన పరిస్థితి కొత్త తలనొప్పిని తెచ్చిపెడుతోంది. ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన పార్టీ మద్దతుదారులు సృష్టిస్తున్న హింసాకాండకు అక్కడ సుమారు ఆరుగురు భద్రతా సిబ్బంది మరణించగా వందలాదిగా జనం గాయాల పాలయ్యారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పాక్ ప్రభుత్వం ఇస్లామాబాద్‌ను అష్టదిగ్బంధం చేసి ఆందోళనకారులు హింసాత్మక ఘటనలకు పాల్పడితే కాల్చి చంపాలని ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా పాక్ పర్యటనలో ఉన్న శ్రీలంక - ఏ జట్టు తమ ఈ అల్లర్ల నేపథ్యంలో తమ ఆటగాళ్లను వెనక్కి పిలిచింది. ఇది పీసీబీకి గట్టి ఎదురుదెబ్బ. ఇదే కారణాన్ని చూపుతూ మరికొన్ని దేశాల బోర్డులు తమ ఆటగాళ్లను పాక్‌కు పంపడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు పాకిస్థాన్‌లో చాంపియన్స్ ట్రోఫీ ఉంటుందా? అనేది అనుమానంగా మారింది. ఒకవేళ టోర్నీ మొత్తం రద్దు చేయాలని భావిస్తే తాము చాంపియన్స్ ట్రోఫీని ఎక్కడ నిర్వహించినా పాల్గొనేది లేదని పీసీబీ ఇప్పటికే బెదిరింపులకు దిగిన నేపథ్యంలో శుక్రవారం సమావేశంలో ఐసీసీ ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరం.

# స్వియాటెక్‌పై ఒక నెల నిషేధం



లండన్: నిషేధిత ఉత్ప్రేరకాలు వాడినందుకు గాను ఐదుసార్లు గ్రాండ్‌స్లామ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్‌పై ఒక నెల నిషేధం పడింది. ఈ మేరకు ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ (ఐటీఐఏ) ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించిన డోప్ పరీక్షలో పోలండ్ భామ పాజిటివ్‌గా తేలింది. స్వియాటెక్ తన తప్పును ఒప్పుకోవడంతో ఆమెపై నామమాత్రపు శిక్షగా నెల రోజుల నిషేధాన్ని విధించినట్టు ఐటీఐఏ తెలిపింది.



# సినిమా వార్తలు | MOVIE NEWS





## నందమూరి మోక్షజ్ఞ న్యూ లుక్స్ వైరల్

**సినిమా, మహా:** ప్రముఖ హీరో బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ త్వరలోనే సినిమా ఇండస్ట్రీకి పరిచయం కానున్నారు. ప్రశాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో మోక్షజ్ఞ నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ ఇప్పటికే రిలీజైన విషయం తెలిసిందే. అయితే, తాజాగా మరో లుక్ విడుదలయ్యింది. మోక్షజ్ఞ కొత్త లుక్ లో అదరగొడుతున్నారు. యాక్షన్ కోసం సిద్ధమా? సింబా ఈజ్ కమింగ్ అంటూ ప్రశాంత్ వర్మ పోస్ట్ పెట్టారు. నెట్టింట్లో ప్రస్తుతం ఈ ఫొటో తెగ వైరల్ అవుతుంది. వాహ్ మోక్షజ్ఞ అంటూ నెటిజన్స్ ఫిదా అవుతున్నారు.

## వచ్చే నెల గోవాలో నా పెళ్లి: కీర్తి సురేష్

**సినిమా, మహా:** ప్రముఖ హీరోయిన్ కీర్తి సురేష్ పెళ్లి ముహూర్తం ఖరారయ్యింది. డిసెంబర్ మాసంలో ఆమె వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి స్వామివారిని ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని పేర్కొన్నారు. వచ్చే నెలలో తాను పెళ్లి చేసుకోబోతున్నట్లు చెప్పారు. గోవాలో వివాహ కార్యక్రమం జరగనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా తాను నటిస్తున్న ఓ సినిమా కూడా వచ్చే నెలలో రిలీజ్ కానున్నదని, ఈ క్రమంలో కూడా తిరుమల స్వామివారి దర్శనానికి వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇదిలా ఉంటే తన చిన్ననాటి మిత్రుడు ఆంటోనీతో త్వరలోనే పెళ్లి చేసుకోబుతున్నానంటూ తన 15 ఏళ్ల ప్రేమను పరిచయం చేస్తూ సోషల్ మీడియాలో కీర్తి సురేష్ ఓ పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే.



## వడ్డీతో సహా తిరిగి వస్తుంది.. గుర్తుపెట్టుకో : నయనతార

**సినిమా, మహా:** హీరోయిన్ నయనతార సోషల్ మీడియాలో తాజాగా ఓ పోస్ట్ పెట్టారు. అందులో ఓ సందేశాన్ని చెప్పుకొచ్చారు. 'అబద్ధాలతో పక్కవారి జీవితాన్ని నాశనం చేస్తే అది ఏదోరోజు తిరిగి మీకు వడ్డీతో సహా వస్తుంది గుర్తుపెట్టుకోండి' అంటూ నయనతార ఆ పోస్టులో పేర్కొన్నారు. అయితే, కర్మ సిద్ధాంతాన్ని ఉద్దేశిస్తూ ఉన్నట్టుండి ఆమె ఈ పోస్ట్ ను ఎందుకు పెట్టారో తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. ఓ డాక్యుమెంటరీ విషయంలో నయనతార హీరో ధనుష్ మధ్య వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ అంశంపై గత కొన్నిరోజులుగా కోలీవుడ్ లో చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే నయనతార ఈ పోస్ట్ ను పెట్టి ఉండొచ్చని నెటిజన్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం నెట్టింటా ఈ పోస్ట్ తెగ వైరల్ అవుతుంది.



## నాగచైతన్య - శోభితా హల్దీ ఫొటోలు వైరల్



**సినిమా, మహా:** సినిమా హీరో అక్కినేని నాగచైతన్య నటి శోభితా ధూళిపాళ్ల డిసెంబర్ 4న వివాహ బంధంతో ఒక్కటికానున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇరు కుటుంబాలు పెళ్లి ఏర్పాట్లలో బిజీ బిజీగా ఉన్నాయి. అన్నపూర్ణ స్టూడియోలో వీరి వివాహ కార్యక్రమం జరగనున్నది. తాజాగా ఈ జంటకు హల్దీ వేడుకను నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుకల్లో ఇరు కుటుంబ సభ్యులు, సన్నిహుతులు పాల్గొన్నారు. కాబోయే వధూవరులకు మంగళస్నానాలు చేయించి అభినందనలు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో భారీగా వైరల్ అవుతున్నాయి. ఈ విషయం తెలిసి ఈ జంటకు నెట్టింటా కంగ్రాట్స్ చెబుతున్నారు సినీ ప్రముఖులు, అభిమానులు. ఇదిలా ఉంటే.. అక్కినేని అఖిల్ ఎంగేజ్ మెంట్ కు సంబంధించిన ఫొటోలను ఇటీవలే హీరో నాగార్జున షేర్ చేస్తూ త్వరలోనే వారిద్దరు కూడా వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారని చెప్పిన విషయం తెలిసిందే.

## పుష్ప 2 ది రూల్ అడ్వాన్స్ బుకింగ్ అప్‌డేట్.!

డిసెంబర్ 05న విడుదలయ్యే పుష్ప 2 ది రూల్ సినిమా కోసం యావత్ ప్రపంచం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. 6 భాషల్లో విడుదలవుతున్న ఈ సినిమా కోసం ఇప్పటికే ఓవర్సీస్ బుకింగ్స్ స్టార్ట్ అవ్వగా.. రికార్డు స్థాయిలో టికెట్స్ బుక్ అవుతున్నాయి. అయితే ఇండియాలో ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఎప్పుడు స్టార్ట్ అవుతాయా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మూవీ బుకింగ్స్‌కు సంబంధించి ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇప్పటికే సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంకి సంబంధించి అడ్వాన్స్ బుకింగ్స్ నవంబర్ 30 మధ్యాహ్నం 12 గంటల తర్వాత నుంచి స్టార్ట్ కాబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఇందులో తెలంగాణకు సంబంధించి మాత్రమే అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కాబోతున్నట్లు తెలుస్తుంది. ఆంధ్రలో టికెట్ రేట్స్‌కి సంబంధించి ఇంకా చర్చలు పూర్తికాలేక పోవడం.. పుష్ప టీం అడుగుతున్న రేట్లను ఏపీ ప్రభుత్వం ఒప్పుకోకపోవడం దీనికి కారణం అని తెలుస్తుంది. కాగా దీనిపై రేపు క్లారిటీ రానుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

